జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :13 సంచిక :50 శనివారం 24-10-2026 పేజీలు:8 వెల:రు 3/-

https://www.epaperjournalistdiary.com/



బీజేపీ, బీఆర్ఎస్ మధ్య
రహస్య ఒప్పందం!

- రెండు పార్టీలు ఒక్కటేనన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తాయని ఆరోపణ
- రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటనపై ప్రశ్నలు
- బీజేపీ అభ్యర్థుల ప్రకటన తర్వాతే బీఆర్ఎస్ అభ్యర్థుల బరిలోకి దిగుతారని వ్యాఖ్య
- పార్లమెంట్‌లో కేంద్ర బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని విమర్శ
- కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ హామీ ఏమైందని నిలదీత
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై ప్రశ్నలు
- నిజామాబాద్ అర్బన్‌లో మీడియా సమావేశంలో వ్యాఖ్యలు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:

తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఆ రెండు పార్టీలు ఒక్కటేనని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తాయని వ్యాఖ్యానించారు. గురువారం నిజామాబాద్ అర్బన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందనడానికి త్వరలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు బీఆర్ఎస్ ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించకపోవడమే నిదర్శనమని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. ముందుగా బీజేపీ అభ్యర్థులను ప్రకటించిన తర్వాత బీఆర్ఎస్ నామమాత్రంగా అభ్యర్థులను బరిలోకి దింపుతుందని ఆరోపించారు.

-మిగతా 2 లో

సమన్వయంతోనే
నేరాల కట్టడి


సురక్షిత దక్షిణ భారతమే లక్ష్యంగా పనిచేయాలి


- నేరస్తుల సమాచార మార్పిడికి ఉమ్మడి వ్యవస్థ ఏర్పాటు చేయాలి
- దక్షిణాది రాష్ట్రాల పోలీసులకు సీఎం రేవంత్ పిలుపు
- మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ ముందడుగు
- ఈగల్ పనితీరుకు కేంద్రం నుంచి 80 శాతానికి పైగా మార్కులు
- ఆహార కల్తీ, ఔషధాల నియంత్రణకు ప్రత్యేక విభాగం
- అమర పోలీసుల కుటుంబాలకు రూ.కోటి నుంచి రూ.2 కోట్ల పరిహారం
- దక్షిణాది రాష్ట్రాల పోలీస్ ప్రాంతీయ సమన్వయ సమావేశాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి

హైదరాబాద్,

దక్షిణ భారతదేశాన్ని అత్యంత సురక్షితమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. నేరాలకు రాష్ట్రాల సరిహద్దులు అడ్డుకావని, వాటిని సమర్థంగా అరికట్టాలంటే ఉమ్మడి కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు. నేరస్తుల సమాచార మార్పిడికి పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దక్షిణాది రాష్ట్రాల పోలీసు ప్రాంతీయ సమన్వయ కమిటీ సదస్సుతో

-మిగతా 2 లో





భారత్-చైనా సరిహద్దులో
మళ్లీ ఉద్రిక్తతలు

- ఎల్ఏసీ వెంబడి చైనా సైనికుల కదలికలపై ఆందోళన
- పెట్రోలింగ్ విధానాలను మార్చుకుంటున్న చైనా బలగాలు
- అరుణాచల్‌లో పలుచోట్ల ఎదురెదురుగా ఇరు దేశాల సైనికులు
- సరిహద్దులో శాంతి అత్యంత కీలకమన్న విదేశాంగ శాఖ
- సమస్యల పరిష్కారానికి దౌత్య, సైనిక చర్చలు
- చైనా బలగాలను ఎదుర్కొనేందుకు రంగంలోకి శౌర్య కమాండోలు
- సరిహద్దు భద్రతకు డ్రోన్లు, ప్రత్యేక శిక్షణ
- ఐటీబీపీ డీజీ శత్రుజీత్ కపూర్ కీలక వ్యాఖ్యలు



అరెస్టులతో మా ఉద్యమాన్ని ఆపలేరు!

- జైలులో ఉన్నా.. బయట ఉన్నా పోరాటం కొనసాగుతుంది
- సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా స్పష్టీకరణ
- ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ విచారణకు హాజరైన ఇద్దరు నేతలు
- జంతర్‌మంతర్ ఆందోళనపై మరో కేసులో పోలీసుల నోటీసులు
- సీఈసీ రాజీనామా డిమాండ్‌పై వెనక్కి తగ్గబోమని వ్యాఖ్యలు

ఏపీలో నామినేషన్ల హింసపై..
54 మందిపై కేసులు నమోదు

-ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడి
-రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో 31 ఘర్షణలు, దాడుల కేసుల నమోదు
-వాహనాల దహనం, జేసీబీతో ఇల్లు కూల్చివేత
-ఓ అభ్యర్థిని తరలిస్తున్న పోలీసు వాహనంపై దాడి



మంగళగిరి,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ హింసాత్మకంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల ఘర్షణలు, దాడులు చోటు చేసుకోవడంతో, ఈ ఘటన లపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తీవ్రంగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియలో హింసకు పాల్పడేవారు, నామినేషన్లను అడ్డుకునేవారు ఏ పార్టీకి చెందిన వారైనా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గురువారం ఒక్కరోజే 13 జిల్లాల్లో 31 ఘటనలు నమోదైనట్లు వెల్లడించారు. 22 హింసాత్మక ఘర్షణలు, 9 నామినేషన్ పత్రాలను చించివేత

ఈ ఘటనల్లో 22 హింసాత్మక ఘర్షణలు కాగా, 9 నామినేషన్ పత్రాలను చించివేయడం లేదా లాక్కోవడం వంటివి ఉన్నాయి. అత్యధికంగా అనంతపురం జిల్లాలో 8 ఘటనలు జరిగాయి. అన్నమయ్య, కడప, ప్రకాశం జిల్లాల్లో మూడేసి హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ దాడుల్లో రెండు కార్లు, రెండు మోటార్‌సైకిళ్లు సహా నాలుగు వాహనాలకు నిప్పు పెట్టారు. రాళ్లు, కర్రలతో దాడులు, ఒకచోట జేసీబీతో ఇంటిని కూల్చివేయడం,

-మిగతా 2 లో

ప్రజాస్వామ్యాన్ని
ఖూనీ చేస్తున్నారు...

- చంద్రబాబుపై జగన్ ఫైర్
- నామినేషన్ కేంద్రాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు చేశారన్న జగన్
- వైసీపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపాటు
- సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత కూడా ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని విమర్శ



వైసిపి మాజీ మంత్రి విడదల రజనిని కింద పడేసిన మహిళ ఎస్సై...

- పల్నాడుజిల్లా చిలకలూరిపేటలో వైసిపి మహిళా నాయకురాలు, మాజీ మంత్రివిడదల రజని, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం
- తన మద్దతుదారుడిని ఇంట్లోకి రానివ్వకపోవడంపై పోలీసులను నిలదీసిన వైనం
- ఎస్ఐ అడ్డుకోవడంతో జరిగిన తోపులాటలో కిందపడిపోయిన విడదల రజని
- వైసీపీ అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు





అక్టోబర్ 31లోగా కరువు మండలాల ప్రకటన!

- రాష్ట్రంలో 358 మండలాల్లో కరువు పరిస్థితులు
- ఎల్‌నినో ప్రభావంపై కేబినెట్ ఉపసంఘం సమీక్ష
- త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయం
- తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి
- 324 మండలాల్లో ఆందోళనకరంగా భూగర్భ జలమట్టాలు
- జలాశయాల్లో 470 టీఎంసీలకు 170 టీఎంసీలే నిల్వ
- కరువు నివారణ పనులకు రూ.7 వేల కోట్ల వ్యయం
- ముందస్తు కార్యాచరణకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు

హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తలెత్తనున్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలను వేగవంతం చేసింది. అక్టోబర్ 31లోగా కరువు ప్రభావిత మండలాలను ప్రకటించడంతో పాటు పరిస్థితులపై చర్చించేందుకు త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కేబినెట్ ఉపసంఘం నిర్ణయించింది. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

-మిగతా 2 లో



కివీస్‌తో రెండో సమరానికి
భారత్ సిద్ధం!

- తొలి టీ20 విజయంతో సమరోత్సాహంలో టీమిండియా
- సిరీస్‌లో ఆధిక్యం పెంచుకోవడమే లక్ష్యం
- గాయంతో రెండో మ్యాచ్‌కు ఇషాన్ కిషన్ దూరం
- తుది జట్టులో వైభవ్ సూర్యవంశీకి అవకాశం
- బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులకు కసరత్తు
- తొలి ఓటమికి బదులు తీర్చుకోవాలని కివీస్ పట్టుదల
- క్రైస్ట్‌చర్చ్ వేదికగా ఆసక్తికర పోరు
- మధ్యాహ్నం 12:30 గంటలకు మ్యాచ్ ప్రారంభం

రేవంత్ పాలనకు మరో ఏడాదే!

ఆ తర్వాత తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వమే వస్తుంది

- దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకపాత్ర పోషిస్తారు
- కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా కొత్త రాజకీయ శక్తులు
- రాష్ట్రంలో దోపిడీ పాలన సాగుతోందని కేటీఆర్ విమర్శ
- ఎల్‌నినో హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణ
- స్థానిక ఎన్నికలకు వెళ్లే ధైర్యం కాంగ్రెస్‌కు లేదని వ్యాఖ్య
- ఎన్నికలు జరిగితే కార్పొరేషన్లలో బీఆర్ఎస్ విజయమని ధీమా
- అంబర్‌పేట బీఆర్ఎస్ నేతల సమావేశంలో కేటీఆర్ వ్యాఖ్యలు

హైదరాబాద్

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన మరో ఏడాది మాత్రమే కొనసాగుతుందని, ఆ తర్వాత కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించి దోపిడీ పాలన సాగిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. దేశ రాజకీయాల్లోనూ త్వరలో కీలక మార్పులు చోటుచేసుకుంటాయని, కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ పార్టీలు బలపడతాయని అభిప్రాయపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

-మిగతా 2 లో



బీజేపీ, బీఆర్ఎస్ మధ్య
రహస్య ఒప్పందం!

(మొదటి తరువాయి)

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని ఆయన విమర్శించారు. బీజేపీతో ఆ పార్టీకి ఉన్న సన్నిహిత సంబంధాలకు ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపిస్తామని గతంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఒప్పందం ఉందన్నవి కాంగ్రెస్ నేత చేసిన రాజకీయ ఆరోపణలు కాగా, దీనిపై సంబంధిత పార్టీల స్పందన ఈ ప్రకటనలో ప్రస్తావించలేదు.

రేవంత్ పాలనకు మరో ఏడాదే!

(మొదటి తరువాయి)

ఈ కార్యక్రమంలో మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. దేశాన్ని బీజేపీ సంక్షోభంలోకి నెడుతోందని, మరోవైపు కాంగ్రెస్ ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ ఎజెండాను అందించలేకపోతోందని కేటీఆర్ విమర్శించారు. ప్రధాని మోదీ పాలనతో పాటు రాహుల్‌గాంధీ రాజకీయ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో కేసీఆర్ గతంలో చెప్పిన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకపాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని కేటీఆర్ అన్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందని, ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తప్పదని వ్యాఖ్యానించారు. గతంలో బీఆర్ఎస్ సాధించిన విజయాలను పునరావృతం చేస్తామని, కార్పొరేషన్లలో పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉద్ధృతం చేస్తామని, పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

అరెస్టులతో మా ఉద్యమాన్ని ఆపలేరు!

- జైలులో ఉన్నా.. బయట ఉన్నా పోరాటం కొనసాగుతుంది
- సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా స్పష్టీకరణ
- ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ విచారణకు హాజరైన ఇద్దరు నేతలు
- జంతర్‌మంతర్ ఆందోళనపై మరో కేసులో పోలీసుల నోటీసులు
- సీఈసీ రాజీనామా డిమాండ్‌పై వెనక్కి తగ్గబోమని వ్యాఖ్యలు

న్యూఢిల్లీ



తమను అరెస్టు చేసినంత మాత్రాన సీజేపీ చేపట్టిన ఉద్యమం ఆగిపోదని ఆ పార్టీ అగ్రనేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా స్పష్టం చేశారు. పార్టీ నాయకులు జైలులో ఉన్నా, బయట ఉన్నా ప్రజల తరఫున పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. అక్టోబర్ 13న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ఆందోళన సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలపై ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు జారీ చేసిన సమన్ల మేరకు శుక్రవారం ఇద్దరు నేతలు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అరెస్టులతో తమ ఉద్యమాన్ని అణచివేయలేరని పేర్కొన్నారు. తాము నాయకులం కాదని, దేశ ప్రజలు తమకు అప్పగించిన వ్యవస్థకు సంరక్షకులం మాత్రమేనని రాంకా, దాస్ వ్యాఖ్యానించారు. తమకు చేతనైనంత మంచి చేయాలన్నదే లక్ష్యమని చెప్పారు. అరెస్టుల కారణంగా వ్యవస్థలు ఎలా పనిచేస్తాయో మరింత దగ్గరగా తెలుసుకునే అవకాశం లభించిందన్నారు. నాయకులను అరెస్టు చేస్తే ఉద్యమం ఎలా కొనసాగుతుందని మీడియా ప్రశ్నించగా, వ్యక్తులను నిర్బంధించినా పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 13న సీజేపీ ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలతో రాంకా, దాస్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో వారం రోజులకు పైగా తిహార్ జైలులో ఉన్నారు. గత బుధవారం కోర్టు బెయిల్ మంజూరు చేయగా, అదే రోజు మరో కేసులో ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. దీంతో శుక్రవారం ఇద్దరూ విచారణకు హాజరయ్యారు. తమపై కేసులు నమోదైనా ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు వెల్లడించారు.

రాహుల్ గాంధీ వర్సెస్ ప్రియాంకా గాంధీ..

న్యూఢిల్లీ



కాంగ్రెస్ పార్టీలో అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ మధ్య విబేధాలున్నాయా..? బీజేపీ మాత్రం ఇది నిజమే అని ప్రచారం చేస్తోంది. ప్రియాంకా, రాహుల్ మధ్య అంతర్గత విబేధాలు చోటు చేసుకున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ మేరకు బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి ఈ అంశంపై కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. ఇటీవల ప్రియాంకా గాంధీ తనయుడు, రాహుల్ గాంధీ మేనల్లుడు రైహాన్ వాద్రా విజువల్ ఆర్టిస్ట్, ఫొటోగ్రాఫర్ అనే సంగతి తెలిసిందే.అతడి చిత్రాలతో ఢిల్లీలోని బికనీర్ హౌస్‌లో 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. అయితే, ఈ ప్రదర్శనలో ఉంచిన 105 చిత్రాలలో 74 ఫోటోలను ఎగ్జిబిషన్ నిర్వాహకులు తొలగించారు. వాటిలో యువత నిరసనలు, రాజకీయ అంశాలకు సంబంధించినవి ఉన్నాయని, అందువల్లే వాటిని తొలగించామని నిర్వాహకులు వివరణ ఇచ్చారు. దీనిపై రైహాన్ తల్లి ప్రియాంక గాంధీతోపాటు కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఇది అప్రకటిత సెన్సార్‌షిప్ అని కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ఈ వివాదం రాజకీయ అంశంగా మారింది. ఇంత వివాదం జరిగినా ఈ అంశంపై రాహుల్ గాంధీ ఒక్క ట్వీట్ కూడా వేయలేదు.

ఏపీలో నామినేషన్ల హింసపై..
54 మందిపై కేసులు నమోదు

(మొదటి తరువాయి)

గాల్లోకి కాల్పులు జరపడం వంటి ఘటనలు ఉద్రిక్తతకు దారి తీశాయి. ఓ అభ్యర్థిని తరలిస్తున్న పోలీసు వాహనంపై జరిగిన రాళ్లదాడిలో కానిస్టేబుల్‌కు తలకు తీవ్ర గాయమైంది. ఒక అభ్యర్థితో సహా మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.
ఇప్పటివరకు 16 కేసులు నమోదు... 54 మంది నిందితుల గుర్తింపు
ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు 16 కేసులు నమోదు చేసి, 54 మంది నిందితులను గుర్తించినట్లు డీజీపీ తెలిపారు. నిందితులు టీడీపీ, వైసీపీ, సీపీఎం, స్వతంత్రులుగా ఉన్నారని, పార్టీలతో సంబంధం లేకుండా అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పెండింగ్ కేసులను వెంటనే నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేయాలని, సున్నితమైన కేంద్రాల్లో అదనపు బలగాలను మోహరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు.
ఎలాంటి బెదిరింపులు లేదా హింసకు గురైనా వెంటనే డయల్ 100 లేదా 112కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు

సమన్వయంతోనే నేరాల కట్టడి

(మొదటి తరువాయి)

పాటు డీజీపీల సమావేశాన్ని సీఎం ప్రారంభించి మాట్లాడారు. పోలీసు వ్యవస్థపై చేసే ఖర్చును సమాజ భద్రత, మెరుగైన భవిష్యత్తు కోసం పెట్టే పెట్టుబడిగా భావించాలని అన్నారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న సాంకేతిక మౌలిక సదుపాయాలను పొరుగు రాష్ట్రాలతో పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల కట్టడి, వామపక్ష తీవ్రవాద హింసను అరికట్టడంలో తెలంగాణ పోలీసులు విశేష ఫలితాలు సాధిస్తున్నారని సీఎం తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు హైదరాబాద్ పోలీసు వ్యవస్థను హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లుగా విభజించామని వివరించారు. నేరాల స్వభావానికి అనుగుణంగా హైడ్రా, ఈగల్, టీజీసీఎస్‌బీ, టీజీ టీమార్చ్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగం పనితీరుకు కేంద్ర ప్రభుత్వం 80



శాతానికి పైగా మార్కులు ఇచ్చిందన్నారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన సొమ్మును తిరిగి అందించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పిందని పేర్కొన్నారు. ఆహార కల్తీని అరికట్టడంతో పాటు ఔషధాల నియంత్రణను బలోపేతం చేసేందుకు అమెరికా ఎఫ్‌డీఏ తరహాలో టీజీసీఎఫ్ విభాగాన్ని ప్రారంభించామని తెలిపారు. చెరువులు, జలవనరుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ, ప్రజా ఆస్తుల రక్షణలో హైడ్రా కీలకంగా పనిచేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు హోదా, సర్వీసు ఆధారంగా రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వరకు పరిహారం అందిస్తున్నామని వెల్లడించారు. ఇంటి స్థలంతో పాటు అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, కర్ణాటక డీజీపీ ఎంఏ సలీమ్, తమిళనాడు డీజీపీ మహేష్ అగర్వాల్, పుదుచ్చేరి డీజీపీ షాలిని సింగ్, లక్షద్వీప్ ఏడీజీ బి.శంకర్ జైస్వాల్, కేరళ ఐజీ అజీతా బేగం, ఆంధ్రప్రదేశ్ ఐజీపీ రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 31లోగా కరువు మండలాల ప్రకటన!

(మొదటి తరువాయి)

అధ్యక్షతన జరిగిన కేబినెట్ ఉపసంఘం తొలి సమావేశంలో కరువు నివారణ, తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా, ఉపాధి అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. కరువు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు 20 శాతానికి మించి ప్రభావం ఉన్న మండలాల పరిస్థితులను శాస్త్రీయంగా విశ్లేషించి, నిబంధనల ప్రకారం సిఫార్సులు సిద్ధం చేయాలని అధికారులను భట్టి ఆదేశించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని సూచించారు. అత్యవసర అవసరాలకు ఆర్థిక శాఖ నిధులు అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుత నీటి ఎద్దడి నేపథ్యంలో వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. జిల్లా కలెక్టర్లు ప్రతి వారం సమీక్షలు నిర్వహించి కరువు నివారణ చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. భూగర్భ జలమట్టాలు, వేసవి తీవ్రతకు సంబంధించిన వివరాలను క్రమం తప్పకుండా వెల్లడించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. నీటి సంరక్షణ, వ్యవసాయ సలహాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో సుమారు రూ.7 వేల కోట్లతో కరువు నివారణ పనులు చేపడుతున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యమివ్వాలని, కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులకు అత్యవసర నిధులు అందుబాటులో ఉంచాలని సూచించారు. చెరువుల్లో నీరు తగ్గుతున్న నేపథ్యంలో చేపల సంరక్షణకు చర్యలు చేపడుతున్నామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పశువుల కోసం గ్రామాల్లో నీటితొట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో 358 మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. తక్కువ వర్షపాతం, సాగు విస్తీర్ణం 50 శాతం కంటే తక్కువగా ఉండటం వంటి ప్రమాణాల ఆధారంగా ఈ అంచనాకు వచ్చినట్లు తెలిపారు. అక్టోబర్ 31లోగా కరువు మండలాల జాబితాను కేంద్రానికి సమర్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 18 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉండగా, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందన్నారు. 324 మండలాల్లో భూగర్భ జలమట్టాలు ఆందోళనకరంగా ఉన్నాయని వివరించారు. రాష్ట్ర జలాశయాల్లో మొత్తం 470 టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం 170 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. సింగూరు జలాశయంలో నీటి కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రతి జిల్లా కలెక్టర్‌కు అత్యవసర నిధుల కింద రూ.కోటి విడుదల చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారత్-చైనా సరిహద్దులో మళ్లీ ఉద్రిక్తతలు

-చైనా పెట్రోలింగ్ తీరుపై భారత్ ఆందోళన
-అరుణాచల్ ప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న ముఖాముఖి పరిస్థితులు
-సరిహద్దులో శాంతి తప్పనిసరన్న విదేశాంగ శాఖ



న్యూఢిల్లీ:
భారత్-చైనా సరిహద్దులో మరోసారి ఉద్రిక్తతలు తెరపైకి వచ్చాయి. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి చైనా సైనికులు గతంలో అనుసరిస్తున్న పెట్రోలింగ్ విధానాలకు భిన్నంగా వ్యవహరించడం వల్ల అప్పుడప్పుడు పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నాయని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత నెలకొనడం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి అత్యంత కీలకమని పేర్కొంది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లో పలు ప్రాంతాల్లో చైనా సైనికులతో భారత దళాలకు ఎదురెదురుగా తలపడే పరిస్థితులు కొనసాగుతున్నాయని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ వెల్లడించిన నేపథ్యంలో కేంద్రం స్పందించింది. చైనా బలగాలు గతంలో ఇరు పక్షాల మధ్య ఉన్న పెట్రోలింగ్ విధానాలకు భిన్నంగా వ్యవహరించినప్పుడు సరిహద్దు పరిస్థితులు ఎప్పటికప్పుడు ప్రభావితమవుతున్నాయని జైస్వాల్ తెలిపారు. ఎల్ఏసీ వెంబడి నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు, అపార్థాలు మరియు తప్పుడు అంచనాలను నివారించేందుకు ఇరు దేశాలు ఇప్పటికే ఉన్న దౌత్య, సైనిక మార్గాల ద్వారా చర్చలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. సరిహద్దు నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు ఎల్ఏసీపై పరస్పర అవగాహన పెంచుకునే అంశాలను కూడా భారత్, చైనా చర్చించేందుకు అంగీకరించాయని ఆయన వెల్లడించారు. అయితే, అరుణాచల్ ప్రదేశ్‌లో చోటుచేసుకున్న తాజా ముఖాముఖి ఘటనలకు సంబంధించిన నిర్దిష్ట వివరాలపై స్పందించకుండా, ఆ అంశాలను రక్షణ మంత్రిత్వ శాఖను అడగాలని సూచించారు.
రంగంలోకి 'శౌర్య' కమాండోలు
మరోవైపు, అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ)తో భారత దళాలకు ఎదురెదురుగా తలపడే పరిస్థితులు ఇంకా కొనసాగుతున్నాయని ఐటీబీపీ చీఫ్ శత్రుజీత్ కపూర్ గురువారం వెల్లడించారు. రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఐటీబీపీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. ఇటువంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక శిక్షణ, ఆధునిక సాంకేతికత అవసరమని పేర్కొన్నారు. సరిహద్దు బెటాలియన్లలో డ్రోన్ విభాగాలను ఏర్పాటు చేసినట్లు, గాల్వాన్ లోయలో 2020లో జరిగిన ఘర్షణ తరహా పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక స్ట్రైక్ శిక్షణా కార్యక్రమాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. చైనా బలగాలతో కొనసాగుతున్న ముఖాముఖి పరిస్థితుల్లో శౌర్య కమాండోలు తమ సామర్థ్యాలను ప్రదర్శించారని కూడా ఆయన పేర్కొన్నారు. 2020లో గాల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత భారత్-చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అనంతరం సరిహద్దు సమస్యల పరిష్కారం, సైనిక బలగాల ఉపసంహరణ, ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ దిశగా ఇరు దేశాలు పలు చర్చలు చేపట్టాయి. 2024 అక్టోబర్‌లో తూర్పు లద్దాఖ్‌లోని దెప్సాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల్లో సైనిక బలగాల ఉపసంహరణకు సంబంధించి ఇరు దేశాలు అవగాహనకు వచ్చాయి. అయినప్పటికీ, సరిహద్దులో అప్పుడప్పుడు తలెత్తుతున్న ఉద్రిక్తతలు ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్ఏసీ వెంబడి శాంతి, ప్రశాంతతను కాపాడుకోవడంతో పాటు దౌత్య, సైనిక చర్చలను కొనసాగించడం అత్యవసరమని భారత్ మరోసారి స్పష్టం చేసింది.

కివీస్‌తో రెండో సమరానికి భారత్ సిద్ధం!

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్ పర్యటనను ఘన విజయంతో ప్రారంభించిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా శనివారం క్రైస్ట్‌చర్చ్ వేదికగా భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో టీ20 జరగనుంది. తొలి మ్యాచ్‌లో 226 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి రికార్డు విజయాన్ని అందుకున్న శ్రేయస్ అయ్యర్ సేన అదే జోరును కొనసాగించాలని పట్టుదలతో ఉంది. మరోవైపు తొలి మ్యాచ్‌లో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకోవాలని ఆతిథ్య న్యూజిలాండ్ భావిస్తోంది. తొలి టీ20లో భారత బౌలర్లు ఆశించిన స్థాయిలో రాణించకపోయినా బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో జట్టును గెలిపించారు. సంజూ శాంసన్ 67 పరుగులతో శుభారంభం అందించగా, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 42 పరుగులతో ఆకట్టుకున్నాడు. చివర్లో నమన్ ధీర్ కేవలం 15 బంతుల్లో అజేయంగా 42 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించాడు. దీంతో సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. అయితే రెండో టీ20కి ముందు భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్ తొడ కండరాల గాయంతో మ్యాచ్‌కు దూరమైనట్లు బీసీసీఐ వెల్లడించింది. అతడి స్థానంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. వైభవ్ తుది జట్టులోకి వస్తే అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశముంది. దీంతో సంజూ శాంసన్ వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగవచ్చు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మతో పాటు ఆల్‌రౌండర్లు నమన్ ధీర్, అక్షర్ పటేల్‌పైనా జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. తొలి మ్యాచ్‌లో ధాటిగా ఆడిన నమన్ ధీర్ మరోసారి కీలకంగా మారనున్నాడు. బౌలింగ్ విభాగంలో భువనేశ్వర్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్ మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. తొలి మ్యాచ్‌లో భారీగా పరుగులు సమర్పించుకున్న బౌలర్లు ఈసారి పుంజుకోవాలని భావిస్తున్నారు. మరోవైపు న్యూజిలాండ్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో లోపాలను సరిదిద్దుకుని బరిలోకి దిగనుంది. మ్యాచ్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రారంభం కానుంది.
భారత్ అంచనా తుది జట్టు: అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, నమన్ ధీర్, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్.
న్యూజిలాండ్ అంచనా తుది జట్టు: ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, జాకబ్స్, బ్రాస్‌వెల్, మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), నాథన్ స్మిత్, మాట్ హెన్రీ, మిల్నే, లోకీ ఫెర్గూసన్

ఏఐతో మానవాళి మనుగడకు ముప్పు!

- పదేళ్లలో వినాశనానికి 33 శాతం అవకాశమంటూ హెచ్చరిక
- గూగుల్ మాజీ పరిశోధకుడు అలెక్స్ టర్నర్ సంచలన వ్యాఖ్యలు
- మానవ నియంత్రణ దాటితే తీవ్ర పరిణామాలు తప్పవని ఆందోళన
- భద్రతా ప్రమాణాలను విస్మరిస్తున్న టెక్ కంపెనీలపై విమర్శలు

న్యూఢిల్లీ



కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత భవిష్యత్తులో మానవాళి మనుగడకే ముప్పుగా మారే ప్రమాదముందని గూగుల్ డీప్‌మైండ్ మాజీ పరిశోధకుడు అలెక్స్ టర్నర్ హెచ్చరించారు. రాబోయే పదేళ్లలో ఏఐ కారణంగా మానవాళి అంతమయ్యే అవకాశం 33 శాతం ఉందని ఆయన అంచనా వేశారు. శుక్రవారం ఢిల్లీలో మాట్లాడుతూ మానవుల ఆదేశాలు లేకుండానే ఏఐ వ్యవస్థలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకుంటే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏఐ అభివృద్ధిపై తీసుకునే నిర్ణయాలు, అమలు చేసే భద్రతా చర్యలపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో పోటీ కారణంగా ప్రముఖ కంపెనీలు ఏఐ భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని టర్నర్ ఆరోపించారు. ఆధునిక ఏఐ వ్యవస్థలు ఎలా పనిచేస్తున్నాయో, ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నాయో వాటిని రూపొందించిన శాస్త్రవేత్తలు కూడా పూర్తిస్థాయిలో అర్థం చేసుకోలేకపోతున్నారని తెలిపారు. ఒక ఏఐ వ్యవస్థను పర్యవేక్షించేందుకు మరో ఏఐని ఉపయోగించడం సరైన భద్రతా చర్య కాదన్నారు. ఏఐ లక్ష్యాలను మానవ ప్రయోజనాలకు అనుగుణంగా నియంత్రించే వ్యవస్థలు ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందలేదని చెప్పారు. గతంలో పొగాకు, చమురు కంపెనీలు తమ ఉత్పత్తుల వల్ల కలిగే ప్రమాదాలను దాచినట్లే ప్రస్తుతం కొన్ని ఏఐ కంపెనీలు కూడా ముప్పును తక్కువ చేసి చూపుతున్నాయని టర్నర్ విమర్శించారు. ఏఐ ప్రమాదాలపై హెచ్చరికలను తప్పుదోవ పట్టించే ప్రచారంగా చిత్రీకరిస్తున్నాయని ఆరోపించారు. అమెరికా రక్షణ శాఖతో గూగుల్ ఒప్పందం, సైనిక అవసరాలకు ఏఐ వినియోగంలో భద్రతా ప్రమాణాలపై అభ్యంతరాలతోనే తాను డీప్‌మైండ్ నుంచి బయటకు వచ్చినట్లు వెల్లడించారు. ఏఐ అభివృద్ధితో పాటు మానవ నియంత్రణ, భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

ఎంపీటీసీ జెడ్పీటీసీ నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతను..పరిశీలించిన జిల్లా ఎస్పీ

-డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా..

-అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు





ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : ప్రకాశం జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా ఎస్పీ పొన్నలూరు, కందుకూరు తదితర మండలాల్లోని నామినేషన్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తు, బారికేడ్ల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, అభ్యర్థులు, వారి ప్రతినిధుల వాహనాలు రాకపోకలను సమీక్షించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.నామినేషన్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో నిబంధనల ప్రకారం భద్రత అమలు చేయాలని, అనుమతి లేని వాహనాల రాకపోకలు, పార్కింగ్‌ను నియంత్రించాలని స్పష్టం చేశారు. ప్రజలు గుంపులుగా చేరకుండా, అనుమతి లేని ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అమల్లో ఉన్న పోలీసు 30 యాక్ట్,163 బిఎన్ఎస్ఎస్ (144 సిఆర్.పి.సి) నిషేధాజ్ఞలు, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాల వద్ద డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని, పోలీసు అధికారులు వైర్‌లెస్ ద్వారా సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను పర్యవేక్షించాలని ఎస్పీ తెలిపారు.ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా ఇతర విభాగాల సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.నామినేషన్ కేంద్రాలలో బెల్ హెల్లర్లు, పీఏ వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని,. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో అనవసర గుంపులు గుమిగూడకుండా నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. శాంతిభద్రతలను కాపాడుతూ, నామినేషన్ ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అవసరమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి.

ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు ఎన్నికల నియమావళిని పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.జిల్లా ఎస్పీ వెంట కందుకూరు డిఎస్పి బాలసుబ్రమణ్యం, ఎస్బి సిఐ శ్రీనివాసరావు, కొండేపి సీఐ రమణయ్య, ఆర్ఐ రమణారెడ్డి, పొన్నలూరు ఎస్సై శివ నాగ రాజు, కందుకూరు ఎస్సై భార్గవ్ మరియు స్పెషల్ పార్టీ సిబ్బంది ఉన్నారు.

నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేసుకోండి..

-ఆటంకాలు కలిగిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి

-తాళ్లూరు, ముండ్లమూరు నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

-ఎంపీటీసీ నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత





ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్టు డైరీ :ప్రకాశం జిల్లాలో ఎంపీటీసీ నామినేషన్ల చివరి రోజు సందర్భంగా తాళ్లూరు, ముండ్లమూరు నామినేషన్ కేంద్రాలను జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు శుక్రవారం పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులను ఎవరైనా అడ్డుకున్నా, ఇబ్బందులకు గురి చేసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అవసరమైతే పోలీసు వాహనం లోనే కేంద్రానికి తీసుకెళ్లి నామినేషన్ దాఖలు చేసేలా రక్షణ కల్పిస్తామన్నారు. సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద 30 పోలీస్ యాక్ట్, బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలులో ఉన్నందున 100 మీటర్ల పరిధిలో గుంపులుగా చేరరాదని, అనుమతి లేని వ్యక్తులు, వాహనాలకు ప్రవేశం లేదని స్పష్టం చేశారు. డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలు పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో దర్శి డీఎస్పీ బాల మురళీకృష్ణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ పి. శ్రీధర్, సీసీఎస్ సీఐ కమలాకర్, తాళ్లూరు ఎస్సై, ముండ్లమూరు ఎస్సై కోటేశ్వరరావు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కంటే ముందే పీఆర్సీ ప్రకటించాలి

- పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి..

-సమస్యలు పరిష్కరించిన వారికే మా ఓట్లు

-తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. వెంకట్ రెడ్డి డిమాండ్

-షాద్‌నగర్‌లోని పెన్షనర్స్ భవన్‌లో రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం



రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) : ఎమ్మెల్సీ ఎన్నికల కంటే ముందే ఉద్యోగుల పీఆర్సీని ప్రకటించడంతో పాటు పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్ల ఓట్లు కావాలనుకునే రాజకీయ నాయకులు ముందుగా వారి సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. శుక్రవారం షాద్‌నగర్‌లోని పెన్షనర్స్ భవన్‌లో తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సరాపు జగదీశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు పి. వెంకట్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉస్మాన్ పాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పి. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెన్షనర్ల ఓట్లు కీలకమని, వారి సమస్యలను పరిష్కరించిన వారికే మద్దతు లభిస్తుందని తెలిపారు. పీఆర్సీని ప్రకటించడంతో పాటు పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను ఎన్నికలలోపు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే తమ బలాన్ని ఓట్ల ద్వారా చూపిస్తామని హెచ్చరించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి పెన్షనర్ తమ ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అవసరమైతే ఆయా మండలాలు, యూనిట్ల స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అర్హులైన పెన్షనర్ల ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉస్మాన్ పాషా మాట్లాడుతూ పెన్షనర్లకు అందించే వైద్య సేవలకు సంబంధించి ఎన్ఈహెచ్ఎస్ కార్డుల ద్వారా ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రతి పెన్షనర్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వందేమాతరంతో ప్రారంభమైన సమావేశంలో ఇటీవల మరణించిన వారికి సంతాపం ప్రకటించారు. అనంతరం పెన్షనర్ల సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు నరసింహారావు, ప్రహ్లాదరావు, జిల్లా కోశాధికారి తేలేశ్వర్, సహాధ్యక్షులు గోపాల్ రెడ్డి, దుగ్గు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. షాద్‌నగర్ యూనిట్ తరఫున కోశాధికారి సుధాకర్ రెడ్డి, సహాధ్యక్షుడు ఎం. జనార్దన్, ఉపాధ్యక్షుడు బి. కృష్ణయ్య, సంయుక్త కార్యదర్శి మందారం నరసింహులు, బి. రమేష్, ఈ. పాండు, అబ్దుల్ గఫార్ తదితరులు హాజరయ్యారు. నందిగామ సురేష్ వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత...

నాగారం, అక్టోబర్ 23:-(జర్నలిస్ట్ డైరీ)

సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా 24వ తేది శనివారం ఈ క్రింది ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో నిర్ణీత సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని కీసర విద్యుత్ ఎఈ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు.

విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు ఇలా ఉన్నాయి.

1) 11కేవి శ్రీనగర్ ఫీడర్ -- రాంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఉంటుందన్నారు.

ప్రభావిత ప్రాంతాలు:

రాంపల్లి ఇండస్ట్రియల్ ఏరియా, చెర్లపల్లి--రాంపల్లి రోడ్డు, సాయి నగర్ కాలనీ, జ్యోతి కాలనీ, డీఎస్ఆర్ కాలనీ.

2) 11కేవి యాద్గారపల్లి ఫీడర్ -- యాద్గారపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో

ఉదయం 11:00 గంటల నుండి 11:30 గంటల వరకు. ప్రభావిత ప్రాంతాలు:

యాద్గారపల్లి గ్రామం, చిత్తరమ్మ ఆలయం, టింబర్ డిపో, ఎస్సీ కాలనీ, రామస్వామి కాలనీ, యాద్గారపల్లి ఎజీఎల్.

3) 11కేవు ఎస్ఎల్ఎన్ఎస్ ఫీడర్ -- యాద్గారపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో

ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు.

ప్రభావిత ప్రాంతాలు:

ఎన్ఎస్ఆర్ బృందావన్, గణేష్ టౌన్‌షిప్, ఎంఎల్ఆర్ కాలనీ, బాలాజీ ఎన్‌క్లేవ్, చీర్యాల గ్రామం, ఆర్కేనగర్, ఎన్ఎస్ఎఫ్ కాలనీ, స్వరూప్ నగర్, రోజ్ గార్డెన్, శివ సాయి నగర్, ఈడెన్ గార్డెన్, మల్లన్న ఆలయం, ఎస్ఎల్ఎన్ఎస్ హోమ్స్, ఎస్ఎల్ ప్రైమ్, సాయి నగర్ కాలనీ, విజ్ఞాన్ ఎన్‌క్లేవ్, సాయి కాలనీ.

4) 11కేవి యమ్నంపేట్ ఫీడర్ -- ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11:00 గంటల నుండి 11:30 గంటల వరకు.

ప్రభావిత ప్రాంతాలు:

ఇస్మాయిల్‌ఖాన్‌గూడెం, సాయిగూడెం, యమ్నంపేట్ లలో ఉంటుందని, ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఎన్నికల విధుల నుంచి పులివెందుల డీఎస్పీని తొలగించాలి...హైకోర్టులో ఎంపీ అవినాశ్ రెడ్డి పిటిషన్

-వైసీపీ ఎంపీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

-విషయంపై పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశం



అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో ఉన్న పులివెందుల డీఎస్పీ మురళీనాయక్‌ను బాధ్యతల నుంచి తొలగించాలని కోరుతూ వైసీపీ కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది.

ఈ పిటిషన్‌ను జస్టిస్ ఆలపాటి గిరిధర్ విచారించారు. ఎన్నికల విధుల నుంచి డీఎస్పీని ఎందుకు తొలగించాల్సి ఉందో వివరించాలని కోరుతూ వాదనలు జరిగాయి. అనంతరం, ఈ విషయంపై పూర్తి వివరాలను తమకు సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తరఫు న్యాయవాదిని న్యాయమూర్తి ఆదేశించారు.వివరాలు సమర్పించడానికి కొంత సమయం కావాలని ఎస్ఈసీ తరఫు న్యాయవాది కోరడంతో, తదుపరి విచారణను వాయిదా వేస్తున్నట్లు న్యాయస్థానం ప్రకటించింది

ఎన్నికల విధులు నిర్వహించే వారికి ప్రత్యేక శిక్షణ

-ఎన్నికల నిర్వహణపై ఎంపీడీవోలకు అవగాహన

-ఎన్నికల నిర్వహణ అధికారి ఎం. విజయ సునీత.

మార్కాపురం,జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

మార్కాపురం జిల్లాలో రెండవ విడత సాధారణ మండల పరిషత్ ప్రాంతీయ నియోజకవర్గ (ఎంపీటీసీ) మరియు జిల్లా పరిషత్ ప్రాంతీయ నియోజకవర్గ (జెడ్ పి టి సి) ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకుందని మార్కాపురం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎం. విజయ సునీత తెలిపారు.?రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాల అనుగుణంగా, అభ్యర్థులు ఎవరైనా నామినేషన్లు దాఖలు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటే లేదా అడ్డంకులు సృష్టించబడ్డాయని ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందించాలని పోలీసు యంత్రాంగాన్ని, అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

కలెక్టర్ ముఖ్య ఆదేశాలు మరియు మార్గదర్శకాలు..

నామినేషన్లు వేయకుండా నిరోధించబడ్డామని ఎవరైనా ఫిర్యాదు చేస్తే, సంబంధిత అధికారులు మరియు పోలీసు సిబ్బంది తక్షణమే ఆ ఫిర్యాదుదారులను ఫోన్ ద్వారా సంప్రదించాలని ఆదేశించారు.

నిర్ణీత గడువైన శుక్రవారం సాయంత్రం 5:00 గంటలలోపు వారు నిబంధనల ప్రకారం నామినేషన్ దాఖలు చేసేలా సంబంధిత రిటర్నింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయబడ్డాయని తెలిపారు.?నామినేషన్ కేంద్రాలకు వచ్చే అభ్యర్థులకు అవసరమైన చోట వ్యక్తిగత పోలీసు భద్రతను ఏర్పాటు చేసి, వారు ఎలాంటి భయాలకు తావులేకుండా ప్రశాంతంగా నామినేషన్లు దాఖలు చేసేలా జిల్లా ఎస్పీ తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం. విజయ సునీత సూచించారు.?మార్కాపురం జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేస్తూ, ప్రతి అభ్యర్థి హక్కులకు భరోసా కల్పిస్తామని... నామినేషన్ల స్వీకరణ ముగింపు గడువు సమయం వరకు అన్ని కేంద్రాల వద్ద నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.'

ఎంపీటీసీ, జెడ్పిటిసి నామినేషన్ల ప్రక్రియపై పూర్తి రక్షణ..గడువు లోగా నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ చర్యలు

-మార్కాపురం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎం. విజయ సునీత.

శబరిమలై యాత్రకు బయలుదేరిన అయ్యప్ప స్వాములకు ఇరుముడి పూజలు

- ఇరుముడి పూజా కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఁ అగ్గనూర్ బసవేశ్వర్, మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని శివ మారుతి గీత అయ్యప్ప స్వామి దేవాలయంలో శబరిమలై అయ్యప్ప స్వామి దర్శనానికి పాదయాత్రగా బయలుదేరుతున్న స్వాములకు ఇరుముడి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ కలియుగవర్ధన్ శబరిమల మహాపాదయాత్ర బృందం వేదగిరి ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి శబరిమలై వరకు పాదయాత్ర చేపడుతున్న అయ్యప్ప స్వాములకు షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ రాయికల్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.
ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు నిర్వహించిన ఇరుముడి పూజా కార్యక్రమంలో పాల్గొని, వారి పాదయాత్ర విజయవంతంగా సాగాలని, స్వామివారి దర్శనం సాఫీగా పూర్తిచేసుకొని క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. అయ్యప్ప స్వామి దీక్ష ఆధ్యాత్మికతకు, క్రమశిక్షణకు, భక్తిభావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మురళీమోహన్, అప్పి, దిలీప్, అర్జున్ లక్ష్మణ్, రమేష్ గురుస్వామి నందు గురుస్వామి, శ్రీనివాస్ గురుస్వామి , మల్లేష్ గురుస్వామి,తదితరులు పాల్గొని అయ్యప్ప స్వాములకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ ప్రాంగణం అయ్యప్ప నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు..

- షాద్ నగర్ సీనియర్ న్యాయవాదుల ప్రశంసలు

-న్యాయవాది నుంచి న్యాయమూర్తిగా ఎదగడం గొప్ప విషయం..

- ఆగిరు లక్ష్మీ ప్రసాద్‌కు ఘన సన్మానం



రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :
షాద్‌నగర్ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది ఆగిరు లక్ష్మీ ప్రసాద్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం పట్ల షాద్‌నగర్ సీనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు గంగాధర్, ఎం.ఎ. కరీం, కంచి రాజగోపాల్‌తో పాటు జూనియర్ న్యాయవాదులు లక్ష్మీ ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన లక్ష్మీ ప్రసాద్ కృషి, పట్టుదల, స్వయంకృషితో నేడు న్యాయమూర్తిగా ఎంపిక కావడం ఎంతో గొప్ప విషయమని సీనియర్ న్యాయవాదులు పేర్కొన్నారు. తమ ప్రాంతానికి చెందిన వ్యక్తి న్యాయమూర్తిగా ఉన్నత శిఖరాలను అధిరోహించడం తమకు గర్వకారణమని తెలిపారు. కష్టపడి పనిచేసే తత్వం, పట్టుదల, స్వయంకృషి ఉన్నత స్థానాలకు చేరుస్తాయని, లక్ష్మీ ప్రసాద్ విషయంలో ఇది మరోసారి నిరూపితమైందని వారు అన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. జగన్ మోహన్ రెడ్డితో కలిసి న్యాయమూర్తిగా ఎంపికైన ఆగిరు లక్ష్మీ ప్రసాద్‌ను సన్మానించారు. సీనియర్ న్యాయవాది గంగాధర్ వద్ద న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన లక్ష్మీ ప్రసాద్‌తో పాటు మరో ఇద్దరు న్యాయవాదులు కూడా న్యాయమూర్తులుగా ఎంపిక కావడం విశేషమని సీనియర్ న్యాయవాది కంచి రాజగోపాల్ ఆనందం వ్యక్తం చేశారు. ఒకే గురువు వద్ద న్యాయవాద వృత్తిలో మెళకువలు నేర్చుకున్న వారు న్యాయమూర్తులుగా ఎదగడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంచి అసోసియేట్స్‌కు చెందిన న్యాయవాదులు వెంకట్రాంరెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ కాలనీలో నూతన బోర్ మోటార్ ప్రారంభం

- ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగించడమే లక్ష్యం: మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు రాంనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్ మోటార్‌ను షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రారంభించారు. కాలనీవాసులకు నీటి సరఫరాలో ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు మున్సిపల్ పాలకవర్గం కృషి చేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు.ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా వార్డుల్లో అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. కాలనీల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల అవసరాలను గుర్తించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వాణిశ్రీ పాండు రంగారెడ్డి, మున్సిపల్ ఏఈ నరేష్, సాయికిరణ్, ఇలియాస్, బాలాజీ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు చేయాలి

ప్రజల జీవించే హక్కును కాపాడుకుందాం

మూడవాత్ రాంబల్ నాయక్ చైర్మన్ సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేకంగా పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :
రంగారెడ్డి జిల్లా సిద్దాపూర్ లో డంపింగ్ యార్డు కు వ్యతిరేకంగా జాక్. 20 వ రోజు జరుగుతున్న రిలే నిరహార దీక్షలకు సేవ్ సిద్దాపూర్ అంటూ ఉద్యమానికి మరింత ఊపునించారు..
జేఏసి చైర్మన్ రాంబాల్ నాయక్ ఈ సందర్భంగా ప్రజల యొక్క అభిప్రాయాలు తీసుకోకుండా ఏక పక్షంగా రాష్ట్ర ప్రభుత్వం సిద్దాపూర్ లో డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయం తీసుకుని జీవో 641 తీసుకు రావడం దారుణం అన్నారు.. ఫ్యూచర్ సిటీ కి అతి చేరువలో ఈ డంపింగ్ యార్డు పెట్టడం అంటే ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ ఏంటి అని ప్రశ్నించారు. ప్రజలు కులాల కు మతాల కు అతీతంగా కదలాల్సిన అవసరం ఉందని, డంప్ యార్డు రద్దు అయ్యే వరకు పార్టీలకు అతీతంగా అందరం కలిసి డంపింగ్ యార్డు రద్దు కొరకు పోరాడుదాం!




జీవన విధానానికి నష్టం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం పునఃసమీక్షించాలి
సిద్దాపూర్ గ్రామ ప్రజల జీవన విధానానికి, భవిష్యత్ తరాలకు నష్టం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం పునఃసమీక్షించాలని ఆయన కోరారు. సిద్దాపూర్ గ్రామ పరిరక్షణ కోసం ప్రజలు చేస్తున్న పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఆర్టీ నంబర్ 641ను రద్దు చేసి సిద్దాపూర్ గ్రామాన్ని పరిరక్షించాలని, గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీఓ ఆర్టీ నంబర్ 641ను తొలగిస్తేనే సిద్దాపూర్ ప్రజలు సంతోషంగా జీవిస్తారని ఆయన పేర్కొన్నారు. గ్రామ ప్రజల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.
ప్రజలకు కావాల్సింది హామీలు కాదని, జీవో రద్దుకావడమే ముఖ్యం అని, జీవో రద్దయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుందని అన్నారు. స్థానిక శాసన సభ్యులు దీనినివ్యతిరేకించటం అసెంబ్లీలో మాట్లాడటం మంచి పరిణామమే కానీ ఉద్యమానికి ప్రత్యక్షంగా మద్దతు ఇచ్చి జీవో రద్దు కొరకు ప్రభుత్వంతో చర్చలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (గాణుపూ జీూజ) చైర్మన్ రాంబాల్ నాయక్, బాలయ్య, మహేష్, సిద్దాపూర్ గ్రామ కమిటీ సభ్యులు రాజేందర్ రెడ్డి, శ్రీధరా చారి,, మహేష్, నరేందర్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి, ప్రశాంత్, వంశి , ప్రవీణ్, విక్రమ్, రాజు, చోట మియా, ఓంప్రకాష్, వి గోవిందమ్మ, పోచమ్మ, శాంతమ్మ మరియు మహిళలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో 'మైక్రో అబ్జర్వర్ల'దే కీలకపాత్ర

-జిల్లా ఎన్నికల పరిశీలకులు కె. హెప్సిబా రాణి




ఒంగోలు, ప్రకాశం బ్యూరో జర్నలిస్టు డైరీ :
రాష్ట్ర ఎన్నికల సంఘానికి, జిల్లా ఎన్నికల పరిశీలకులకు క్షేత్ర స్థాయిలో పనిచేసే మైక్రో అబ్జర్వర్లే కళ్ళు, చెవులు వంటి వారని జిల్లా ఎన్నికల పరిశీలకులు కె. హెప్సిబా రాణి అన్నారు. శుక్రవారం ప్రకాశం భవనంలో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పి.రాజా బాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెప్సిబా రాణి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, బి.ఎల్.వో. హెల్ప్ డెస్క్, ఇతర సౌకర్యాలను సూక్ష్మ స్థాయిలో పరిశీలించడంలో మైక్రో అబ్జర్వర్లదే కీలకపాత్ర అన్నారు. ఎన్నికల మ్యాన్యువల్ ప్రకారం ఈ దిశగా విధులపై అవగాహన పెంచుకోవాలన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అందరికీ అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మైక్రో అబ్జర్వర్లు కూడా పూర్తి స్థాయి అవగాహనతో విధులకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు పవర్ పాయింట్ ప్రజెంటేషన్, చెక్ లిస్ట్ ద్వారా విధులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. బ్యాలెట్ బాక్స్ లను నిర్వహించే విధానం పైనా ప్రత్యక్ష అవగాహన కల్పించేలా శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ఈ సమావేశంలో అర్బన్ ఎలక్షన్స్ నోడల్ అధికారి ఎం.వెంకటేశ్వర రావు, ఎల్.డీ.ఎం.రమేష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజా మ్యాత్యూ పాల్గొన్నారు.

వైసిపి మాజీ మంత్రి విడదల రజనిని కింద పడేసిన మహిళ ఎస్సై..

- పల్నాడుజిల్లా చిలకలూరిపేటలో వైసిపి మహిళా నాయకురాలు, మాజీ మంత్రివిడదల రజని, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం

-తన మద్దతుదారుడిని ఇంట్లోకి రానివ్వకపోవడంపై పోలీసులను నిలదీసిన వైనం

-ఎస్ఐ అడ్డుకోవడంతో జరిగిన తోపులాటలో కిందపడిపోయిన విడదల రజని

-వైసీపీ అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు



చిలకలూరిపేట, అమరావతి, ఏపీ బ్యూరో,జర్నలిస్ట్ డైరీ
పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. వైసీపీ నేత విడదల రజిని, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో రజని కింద పడిపోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.
వివరాల్లోకి వెళితే...
ఎడ్లపాడు జెడ్పీటీసీ అభ్యర్థి బుల్లబ్బాయి, విడదల రజినిని కలిసేందుకు ఆమె నివాసానికి వచ్చారు. అయితే, ఇంటి గేటు వద్ద ఉన్న పోలీసులు బుల్లబ్బాయిని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రజని బయటకు వచ్చి, తమ మద్దతుదారుడ్ని ఇంట్లోకి ఎందుకు అనుమతించడం లేదని పోలీసులను తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు.
ఎస్ఐ ప్రియాంక, విడదల రజనికి మధ్య వాగ్వాదం
ఈ సందర్భంగా చిలకలూరుపేట రూరల్ ఎస్ఐ ప్రియాంక, విడదల రజనికి మధ్య వాగ్వాదం జరిగింది. తన మద్దతుదారుడి నామినేషన్‌కు సంబంధించిన బీ-ఫారం వద్ద ఉందని, మూడు రోజులుగా తమ వారిని ఇలాగే ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో ఎస్ఐ అడ్డుకునే ప్రయత్నం చేయడంతో తోపులాట జరిగి విడదల రజని పక్కకు పడిపోయారు.
దీనిపై విడదల రజని తీవ్ర ఆగ్రహం ..
దీంతో విడదల రజని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎస్ఐపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "పిచ్చి పట్టిందా నీకు? నన్ను చంపుతావా నువ్వు? ఏం, మెంటలా నీకు? ఎవడు పంపించాడు నిన్ను ఇక్కడికి?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో రజని నివాసం వద్ద కాసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం, ఆమె తన మద్దతుదారులతో కలిసి అక్కడే నిరసనకు దిగారు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సాయికృష్ణ డెత్ కేసుపై రంగం లోకి
సీబీఐ...విజయవాడలో దర్యాప్తు ప్రారంభం

-సాయికృష్ణ లాకప్ డెత్ కేసు దర్యాప్తును అధికారికంగా చేపట్టిన సీబీఐ

-విజయవాడకు చేరుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ ప్రత్యేక బృందం

-ఇప్పటివరకు దర్యాప్తు చేసిన సిట్ నుంచి రికార్డులను స్వాధీనం చేసుకున్న అధికారులు

-హైకోర్టు ఆదేశాలతో కేసు బదిలీ, మృతుడి తల్లికి రూ.25 లక్షల పరిహారం

-పోలీసులే కొట్టి చంపి, రహస్యంగా దహనం చేశారని ఇటీవల తేల్చిన సిట్



విజయవాడ,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అధికారికంగా చేపట్టింది. హైకోర్టు ఆదేశాల మేరకు, సీబీఐ అడిషనల్ ఎస్పీ నేతృత్వంలోని ప్రత్యేక బృందం శుక్రవారం విజయవాడకు చేరుకుంది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ ప్రత్యేక కోర్టులో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేసింది. ఇప్పటివరకు ఈ కేసును విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నుంచి కీలకమైన రికార్డులు, ఆధారాలను సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ చేసేందుకు సీబీఐ అధికారులు సన్నాహాలు

తదుపరి విచారణలో భాగంగా సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి సమక్షంలో కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ చేసేందుకు సీబీఐ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తుపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసి, నిష్పక్షపాత విచారణ కోసం కేసును సీబీఐకి అప్పగించిన విషయం తెలిసిందే. అంతే కాకుండా, బాధితురాలి తల్లికి నాలుగు వారాల్లోగా రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని కూడా ప్రభుత్వాన్ని ఆదేశించింది.

వాస్తవానికి జరిగింది ఇదే..?

విజయవాడ రాణిగారి తోట ప్రాంతానికి చెందిన గాదె సాయికృష్ణ (25) పై ఉన్న రెండు నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలు పేరుతో ఈ ఏడాది మే 5వ తేదీ అర్ధరాత్రి మార్కాపురంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని కృష్ణలంక పీఎస్‌లో అప్పగించారు. అయితే, అతడిని 24 గంటల్లో కోర్టులో హాజరుపరచకుండా అక్రమంగా నిర్బంధించారు. ఈ క్రమంలో తన కుమారుడి ఆచూకీ లేదంటూ తల్లి విజయలక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.

కోర్టు ఆదేశాలతో రంగంలోకి దిగిన సిట్

కోర్టు ఆదేశాలతో రంగంలోకి దిగిన సిట్, తన దర్యాప్తులో విస్తుపోయే నిజాలను వెలుగులోకి తెచ్చింది. కృష్ణలంక సీఐ ఎస్.ఎస్.వి.వి. నాగరాజు, ఇతర సిబ్బంది సాయికృష్ణను ఓ పాత భవనంలో నిర్బంధించి తీవ్రంగా కొట్టడంతో మే 12న మరణించాడని తెలిపింది. ఆ తర్వాత శవాన్ని రహస్యంగా స్వర్గపురి శ్మశానవాటికలో దహనం చేశారని సిట్ తన రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది. సాక్ష్యాలను మాయం చేసేందుకు సీసీటీవీ హార్డ్ డిస్క్‌లను మార్చడం, సాయికృష్ణ గోవా వెళ్లాడని నమ్మించేందుకు అతని ఫోన్‌ను వేరే వ్యక్తికి ఇచ్చి పంపడం వంటి చర్యలకు పాల్పడినట్లు తేలింది. ఈ కేసులో సీఐ నాగరాజుతో పాటు పలువురిని సిట్ అరెస్ట్ చేసింది.

సీబీఐ విచారణలో మరిన్ని వాస్తవాలు వెలుగులోకి

ప్రస్తుతం సిట్ దర్యాప్తు ముగిసి, సీబీఐ రంగప్రవేశం చేయడంతో ఈ కేసు మరో కీలక దశకు చేరుకుంది. సీబీఐ విచారణలో మరిన్ని వాస్తవాలు, బాధ్యులైన అధికారుల పూర్తి వివరాలు బయటకు వస్తాయని బాధితురాలి కుటుంబం ఆశిస్తోంది

ప్రతిభకు దక్కిన గౌరవం..
జడ్జిగా ఎంపికైన అగిరు లక్ష్మీ ప్రసాద్

- ఘనంగా సత్కరించి,శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :
అగిరు లక్ష్మీ ప్రసాద్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి షాద్ నగర్ పట్టణంలోని వారి నివాసానికి వెళ్లి అగిరు లక్ష్మీ ప్రసాద్ గారిని శాలువాతో సత్కరించి,ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ..న్యాయ వాదిగా విధులు నిర్వహిస్తూ కష్టపడి చదివి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం లక్ష్మీ ప్రసాద్ ప్రతిభకు,నిరంతర కృషికి దక్కిన గౌరవమని కొనియాడారు. న్యాయవ్యవస్థలో ఎంతో బాధ్యతాయుతమైన ఈ పదవిని చేపట్టబోతున్న ఆయన,భవిష్యత్తులో ప్రజలకు నిష్పక్షపాతంగా న్యాయం అందిస్తూ,ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.
ఈ సత్కార కార్యక్రమంలో షాద్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బీరంగూర జగన్మోహన్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య, నందకిషోర్,షాద్ నగర్ పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షులు మలిపెద్ది శ్రీనివాస్ గుప్తా,మాజీ సర్పంచ్ అజయ్ నాయక్,నాయకులు దండు రాము,హర్ష వర్ధన్ రెడ్డి,అన్వారీ రాజు,శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియ ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించి 'పకడ్బందీ'గా నిర్వహించాలి....

ఒంగోలు ప్రకాశం బ్యూరో జర్నలిస్టు డైరీ :
జడ్పిటిసి/ ఎంపీటీసీ నామినేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారితో కలిసి శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుండి వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రిటర్నింగ్ అధికారులతో మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియను ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించి పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. జే.పంగులూరు, లింగసముద్రం రిటర్నింగ్ అధికారులతో ఇతరులతో మాట్లాడి నామినేషన్ల ప్రక్రియ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్ ప్రక్రియకు అభ్యర్థులను అనుమతించాలని ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా పాటించాలన్నారు. నామినేషన్ కేంద్రం నుండి వంద మీటర్ల పరిధిలో నిబంధనను తూచా తప్పకుండా పాటించాలని ఆయన సూచించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలు అలసత్వం వహించవద్దని ఆయన సూచించారు....

జడ్పీటీసీ అభ్యర్థిగా
నామినేషన్ వేసిన పరిటాల శ్రీరామ్...

-కదిరి నియోజకవర్గం నల్లచెరువు జడ్పీటీసీ అభ్యర్థిగా శ్రీరామ్ నామినేషన్

-సత్యసాయి జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ సమర్పణ

-నిరాడంబరంగా నామినేషన్ ప్రక్రియ పూర్తి



కదిరి, సత్యసాయి, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరుస్తూ, తెలుగుదేశం పార్టీ నేత పరిటాల శ్రీరామ్ స్థానిక సంస్థల ఎన్నికల బరిలోకి దిగారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం నల్లచెరువు జడ్పీటీసీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆయన ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు. ఎలాంటి హడావుడి లేకుండా నిరాడంబరంగా ఈ ప్రక్రియ పూర్తి చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ పత్రాల అందజేత

నామినేషన్ల స్వీకరణకు చివరి రోజైన శుక్రవారం, పరిటాల శ్రీరామ్ కొత్తచెరువు లోని శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన వెంట కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్. రాజు ఉన్నారు. కదిరి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని నల్లచెరువు నుంచి ఆయన పోటీకి దిగడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవిని కైవసం చేసుకునే వ్యూహంలో భాగంగా...

శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవిని కైవసం చేసుకునే వ్యూహంలో భాగంగానే, టీడీపీ అధిష్ఠానం పరిటాల శ్రీరామ్‌ను జడ్పీటీసీ అభ్యర్థిగా బరిలోకి దించినట్లు తెలుస్తోంది. జిల్లా జడ్పీ ఛైర్మన్ అభ్యర్థిగా ఆయనే ఉంటారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ పరిణామం చోటు చేసుకుంది. నవంబర్ 3న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపు జరగనుంది. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణల గడువు ముగిశాక తుది అభ్యర్థుల జాబితా వెలువడనుంది

తెలంగాణ ఉద్యమకారుల హామీల అమలుపై సమావేశం

- 25న షాద్‌నగర్‌లో మండల నియోజకవర్గ స్థాయి కమిటీల సమావేశం



రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (జర్నలిస్ట్ డైరీ)
తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో మండల, నియోజకవర్గ స్థాయి కమిటీల సమావేశాన్ని నిర్వహించనున్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలు అంశంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. ఈ నెల 25వ తేదీ ఆదివారం ఉదయం 9:30 గంటలకు షాద్‌నగర్‌లోని పెన్షనర్ భవన్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండల, నియోజకవర్గ స్థాయి కమిటీల సభ్యులందరూ తప్పనిసరిగా సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు, సంక్షేమం, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షుడు టీజీ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నందిగామ సురేష్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నారు.

పులివెందులలో నామినేషన్ల వేళ హై టెన్షన్..
అవినాశ్ రెడ్డి ఇంటికి పోలీసుల నోటీసులు

-పులివెందులలో ఉద్రిక్తతల మధ్య నామినేషన్ల పర్వం

-పట్టణంలో ర్యాలీలు, సభలపై నిషేధం ఉందన్న పోలీసులు

-నలుగురు లేదా ఐదుగురికి మించి గుమికూడకూడదని హెచ్చరిక

పులివెందుల,కడప, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
కడప జిల్లా పులివెందులలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొనసాగుతోంది. శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. ఇందులో భాగంగా వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి నివాసానికి పోలీసులు అధికారికంగా నోటీసులు జారీ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

పులివెందుల పట్టణంలో బీఎన్ఎస్ సెక్షన్ 163, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 కింద కఠిన ఆంక్షలు అమల్లో ఉన్నాయని పులివెందుల అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పేరుతో జారీ చేసిన నోటీసులో స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎలాంటి ర్యాలీలు, బహిరంగ సభలు, ధర్నాలకు అనుమతి లేదని తెలిపారు. నలుగురు లేదా ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడితే నిబంధనల ఉల్లంఘనగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైసీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం

అయితే, పోలీసుల చర్యలపై ఎంపీ అవినాశ్ రెడ్డితో పాటు వైసీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తమ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకునేందుకే అధికార పక్షం ఒత్తిడితో పోలీసులు ఈ ఆంక్షలు విధిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాన్ని అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణంలో భారీగా పోలీసులను మోహరించారు

ఎల్‌నినో ఎఫెక్ట్..
సన్న వడ్లకు రికార్డు ధర...

క్వింటాల్‌కు రూ.4,000.. గతేడాదితో పోలిస్తే దాదాపు రెట్టింపు ధర...

నాగారం, అక్టోబర్ 23:-(జర్నలిస్ట్ డైరీ)
తెలంగాణలో ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో సన్న వడ్ల దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో వాటికి భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో సన్న వడ్ల ధరలు గణనీయంగా పెరిగి, ప్రస్తుత సీజన్‌లో క్వింటాల్‌కు రూ.4,000 వరకు పలుకుతున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
గత ఏడాదితో పోలిస్తే సన్న వడ్ల ధర దాదాపు రెట్టింపు కావడంతో రైతులకు మంచి ఆదాయం లభిస్తోంది. వ్యాపారులు సైతం నేరుగా పొలాల వద్దకే వచ్చి వడ్లను కొనుగోలు చేస్తుండటం విశేషం.

జవహర్‌నగర్ డంప్‌యార్డ్ ను తక్షణమే తొలగించాలి...

- నాగారం మాజీ
మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి..





నాగారం, అక్టోబర్ 23:-(జర్నలిస్ట్ డైరీ)
జవహర్‌నగర్ డంప్‌యార్డ్ సమస్యకు సంబంధించి జరిగిన సమావేశంలో నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ప్రసంగిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తన సందేశాన్ని వినిపించారు.
ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల గొంతుకగా నిలుస్తూ, స్థానిక సమస్యలపై చర్చించారు.

నాగారంలో పోలీస్ అమరవీరుల స్మరణ ర్యాలీ...



నాగారం, అక్టోబర్ 23:-(జర్నలిస్ట్ డైరీ)
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నాగారంలోని సెర్నిటీ మోడల్ స్కూల్ విద్యార్థులతో పోలీసులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కీసర సీఐ, నాగారం ఎస్ఐ నాయకత్వంలో స్కూల్ నుంచి మొదలైన ర్యాలీ నాగారం ప్రధాన కూడళ్ల మీదుగా సాగింది. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగాలను అందరూ స్మరించుకోవాలని, వారి కుటుంబాలకు అండగా ఉండాలని కీసర సీఐ సూచించారు. విద్యార్థులు జెండాలు, ప్లకార్డులతో "పోలీస్ అమరవీరులకు జోహార్" అంటూ నినాదాలు చేశారు నాగారం, కీసర పోలీస్ స్టేషన్ పరిధి
లో ర్యాలీలు నిర్వహించారు.

ఉప్పల్ భగాయత్‌కు ఫేస్ 2 భారీ నిధుల మంజూరు..

- రూ.5 కోట్ల 86 లక్షల నిధులు మంజూరు చేయించిన పరమేశ్వర్‌రెడ్డి

నాగారం, అక్టోబర్23:-(జర్నలిస్ట్ డైరీ)



ఉప్పల్ భగాయత్‌లోని హెచ్ఎండీఏ లే అవుట్‌లో అభివృద్ధి పనులకు వరదలా నిధుల మంజూరు అవుతూనే ఉన్నాయి. లే అవుట్‌లో అన్ని రకాల సౌకర్యాలు, పలు అభివృద్ధి పనులకు ఇప్పటికే పెద్ద మొత్తంలో నిధులు మంజూరు అయిన విషయం తెలిసిందే. ఆ పనులు కొనసాగుతుండగానే మరోసారి ఏకంగా రూ.5 కోట్ల 86 లక్షల నిధులను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి సహకారంతో మాజీ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి మంజూరు చేయించారు.
రెండు పనులకే రూ.5 కోట్ల 86 లక్షల నిధులు..
1. ఉప్పల్ భగయత్ ఫేజ్ – IIలో రూ.3.88 కోట్ల నిధులతో ఇన్నర్ రింగ్ రోడ్ నుండి సుఖీ శ్రీ సుమేరు మీదుగా డీ మార్ట్ వాటర్ ట్యాంక్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ వరకు దెబ్బతిన్న బిటి రోడ్డుకు రీకార్పెటింగ్ పనులు.
2. ఉప్పల్ భగయత్ ఫేజ్ – IIలో రూ.1.98 కోట్ల నిధులతో వాసవి క్రౌన్ ఈస్ట్ మరియు సుఖీ శ్రీ సుమేరు లేన్ల దగ్గర దెబ్బతిన్న బిటి రోడ్డుకు రీకార్పెటింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు...చంద్రబాబుపై జగన్ ఫైర్

-నామినేషన్ కేంద్రాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు చేశారన్న జగన్

-వైసీపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపాటు

-సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత కూడా ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని విమర్శ



అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో రావణకాసుర పాలన నడుస్తోందని ఆయన మండిపడ్డారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థులపై దాడులు చేసి, వారి నామినేషన్ పత్రాలను చించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం, పోలీస్ స్టేషన్లకు పిలిపించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ అక్రమాలపై తాము ఆధారాలు సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), గవర్నర్‌తో పాటు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు.
నామినేషన్ల దాఖలుకు స్వేచ్ఛ కల్పించాలి
తమ పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్ల దాఖలుకు స్వేచ్ఛ కల్పించాలని, అభ్యర్థులకు రక్షణ, సీసీటీవీ రికార్డింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని జగన్ గుర్తు చేశారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
పరిమిత సంఖ్యలో కొన్ని చోట్ల మాత్రమే రీ-నామినేషన్లకు అవకాశం
రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీ లలో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, కానీ ఎస్ఈసీ కేవలం పరిమిత సంఖ్యలో కొన్ని చోట్ల మాత్రమే రీ-నామినేషన్లకు అవకాశం ఇచ్చిందని జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకపక్ష విజయాల కోసం చంద్రబాబు నిబంధనలు మార్చుతున్నారని, ఇది మహాభారతం లోని మాయా జూదాన్ని తలపిస్తోందని ఆయన విమర్శించారు.

ముగ్గురు ఐపీఎస్‌లను తొలగించండి.. రాష్ట్రపతికి వైసీపీ ఎంపీ గురుమూర్తి లేఖ

-కోయ ప్రవీణ్, ధీరజ్ కనుబిల్లి, షెల్కే నచికేత్ విశ్వనాథ్‌లను ఎన్నికల విధుల నుంచి తొలగించాలన్న గురుమూర్తి

-అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని లేఖలో ఆరోపణ

-స్థానిక ఎన్నికల నామినేషన్ల ఘర్షణల నేపథ్యంలో పరిణామం



అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులను ఎన్నికల విధుల నుంచి తక్షణమే తొలగించాలని కోరుతూ వైసీపీ ఎంపీ గురుమూర్తి రాష్ట్రపతి, భారత ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి సహా పలువురు ఉన్నతాధికారులకు లేఖ రాశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆయన తన లేఖలో తీవ్ర ఆరోపణలు చేశారు.
ఎన్నికల విధుల నుంచి తప్పించాలని ఎంపీ గురుమూర్తి డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల సమయంలోనూ డీఐజీ కోయ ప్రవీణ్‌పై పక్షపాత ఆరోపణలు రావడంతో ఎన్నికల సంఘం ఆయన్ను విధుల నుంచి తొలగించిందని, అలాంటి అధికారిని మళ్లీ నియమించడం నిబంధనలకు విరుద్ధమని గుర్తు చేశారు. వైసీపీ అభ్యర్థులపై దాడులు జరిగాయి స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో పుంగనూరు, పులివెందుల, కమలాపురం, బద్వేల్ వంటి ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు జరిగాయని, వారిని అడ్డుకున్నారని గురుమూర్తి ఆరోపించారు. ముఖ్యంగా పుంగనూరులో తమ పార్టీ ఒక్క నామినేషన్ కూడా దాఖలు చేయలేకపోయిందని పేర్కొన్నారు. పోలీసుల పక్షపాత వైఖరి, పర్యవేక్షణ లోపాలపై స్వతంత్ర విచారణ జరిపించాలని, అభ్యర్థులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని ఆయన తన లేఖలో కోరారు

గురుమూర్తి డిమాండ్
డీఐజీ కోయ ప్రవీణ్, అన్నమయ్య ఎస్పీ ధీరజ్ కనుబిల్లి, కడప ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌లను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని ఎంపీ

రాష్ట్రాభివృద్ధికి జగనే అడ్డంకి: ప్రభుత్వ విప్ బొండా ఉమ

-స్థానిక ఎన్నికలను ఆపేందుకు వైసీపీ 59 కేసులు వేసిందని ఆరోపణ

-2021లో దౌర్జన్యాలతో 24% ఏకగ్రీవాలు చేసుకున్నారని వ్యాఖ్య

-కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తోందని స్పష్టీకరణ

-2024లోనే వైసీపీ పతనం మొదలైందని,

-స్థానిక ఎన్నికలతో భూస్థాపితం ఖాయమని జోస్యం



మంగళగిరి, అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
రాష్ట్ర అభివృద్ధిని, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడమే వైసీపీ అధినేత జగన్ ఏకైక అజెండా అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే జగన్ 'క్రిమినల్ లిటిగెంట్'గా మారి, న్యాయస్థానాలను అడ్డు పెట్టుకుని ఎన్నికలను నిలిపి వేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలను ఆపేందుకు వైసీపీ 59 కేసులు వేసిందని ఆరోపించారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.
రూ. 12,500 కోట్ల నిధులను రాకుండా చేయడమే జగన్ కుట్ర
స్థానిక సంస్థలకు 16వ ఆర్థిక సంఘం నుంచి అందాల్సిన సుమారు రూ. 12,500 కోట్ల నిధులను రాకుండా చేయడమే జగన్ కుట్ర అని బొండా ఉమ మండిపడ్డారు. "నేడు ఎన్నికలు జరిగితే వైసీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయం. అందుకే నామినేషన్ల ప్రక్రియ మొదలైన నాటి నుంచే దౌర్జన్యాలకు తెరలేపారు. పుంగనూరు, తిరుపతి, నగరి, రాయచోటి వంటి ప్రాంతాల్లో వాహనాలను తగలబెట్టడం, రాళ్లు, కర్రలతో దాడులు చేయడం వంటి అరాచకాలకు పాల్పడ్డారు. దీనికి సంబంధించిన వీడియో ఆధారాలు కూడా స్పష్టంగా ఉన్నాయి" అని ఆయన పేర్కొన్నారు.
2021 స్థానిక ఎన్నికల్లో వైసీపీ బెదిరింపులు, కిడ్నాపులు,
2021 స్థానిక ఎన్నికల్లో వైసీపీ బెదిరింపులు, కిడ్నాపులు, హత్యాయత్నాలతో 24 శాతం స్థానాలను బలవంతంగా ఏకగ్రీవం చేసుకుందని బొండా ఉమ గుర్తుచేశారు. "పుంగనూరులో 85 స్థానాలకు గానూ 84, మాచర్లలో 77 స్థానాలకు గానూ 74 స్థానాలను ఏకగ్రీవం చేసుకున్న నీచ చరిత్ర జగన్‌ది. 2014లో చంద్రబాబు హయాంలో కేవలం 1 శాతం మాత్రమే ఏకగ్రీవమయ్యాయి. దొంగే దొంగ అన్నట్లుగా, తను చేసిన అరాచకాలను ఇతరులపై నెట్టే ప్రయత్నం జగన్ చేస్తున్నారు" అని విమర్శించారు.
నారాసుర రక్తచరిత్ర' పేరిట దుష్ప్రచారం
సొంత బాబాయిని హత్య చేయించి, 'నారాసుర రక్తచరిత్ర' పేరిట దుష్ప్రచారం చేసిన వ్యక్తి జగన్ అని, గతంలో ఇచ్చిన హామీల్లో 85 శాతం అమలు చేయకుండా ఇప్పుడు అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ 27 నెలల్లో రూ. 1,60,000 కోట్లను సంక్షేమానికి ఖర్చు చేస్తూ, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటోందని అన్నారు. స్థానిక ఎన్నికల్లో పరాజయం తప్పదనే భయంతోనే జగన్ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, 2024లోనే వైసీపీ పతనం ప్రారంభమైందని, స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో జరిగితే ఆ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని బొండా ఉమ జోస్యం చెప్పారు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక


జోగి మేఘన కారు ప్రమాదంపై సమగ్ర విచారణకు ఏపీ మహిళా కమిషన్ ఆదేశం

-అక్టోబరు 15న జోగి మేఘన కారును ఢీకొట్టిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

-ప్రమాదం వెనుక జోగి రమేశ్ హస్తం ఉండొచ్చని మేఘన కుటుంబం అనుమానం

-గతంలోనే వరకట్న వేధింపులు, -హత్యాయత్నం కేసులు నమోదు

-తమకు ప్రాణహాని ఉందని, -భద్రత కల్పించాలని పోలీసులకు విజ్ఞప్తి



విజయవాడ,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ కోడలు జోగి మేఘన ప్రయాణిస్తున్న కారు ఇటీవల ప్రమాదానికి గురైన ఘటనపై ఏపీ మహిళా కమిషన్ స్పందించింది. ఈ ప్రమాదంపై తలెత్తుతున్న అనుమానాల నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు నిగ్గు తేల్చాలని కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ పోలీసులను ఆదేశించారు. మేఘన, ఆమె కుటుంబ సభ్యులకు పూర్తి భద్రత కల్పించాలని స్పష్టం చేశారు.
పూర్తి వివరాల్లోకి వెళితే...
ఈ నెల 15వ తేదీన జోగి మేఘన, ఆమె తండ్రితో కలిసి విజయవాడ నుంచి తెలంగాణ లోని కోదాడకు కారులో బయలుదేరారు.మార్గమధ్యంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వారి కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు వెనుక భాగం దెబ్బతింది. ప్రమాదం జరిగిన తీరుపై అనుమానం రావడంతో, మేఘన తండ్రి మరుసటి రోజు (అక్టోబర్ 16న) ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు ప్రాణహాని ఉందని, ఇది సాధారణ ప్రమాదం కాకపోవచ్చని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని, ఈ ఘటనపై లోతుగా విచారణ జరపాలని కోరారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.
మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజను ఫోన్‌లో సంప్రదించిన జోగి మేఘన
ప్రమాదం జరిగిన అనంతరం జోగి మేఘన నేరుగా మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజను ఫోన్‌లో సంప్రదించి, ఘటన వివరాలను, తన ఆందోళనను తెలియజేశారు. దీనిపై వెంటనే స్పందించిన శైలజ, ఇబ్రహీంపట్నం పోలీసులతో మాట్లాడారు. మేఘన కుటుంబం భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి అనుమానాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.
గత కొంతకాలంగా వివాదాలు
జోగి మేఘనకు, ఆమె అత్తగారి కుటుంబానికి మధ్య గత కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. వరకట్న వేధింపులు, హత్యాయత్నం వంటి తీవ్ర ఆరోపణలతో మేఘన గతంలోనే తన మామ జోగి రమేశ్, భర్త రాజీవ్, ఇతర కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా, సుమారు మూడు నెలల క్రితం తన ప్రాణాలకు ముప్పు ఉందని ఇబ్రహీంపట్నం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయగా, దానిపై కూడా ఒక కేసు నమోదై ఉంది. ఈ నేపథ్యంలో తాజా కారు ప్రమాదం జరగడం తమ అనుమానాలను మరింత బలపరుస్తోందని మేఘన కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రమాదం వెనుక మాజీ మంత్రి జోగి రమేశ్ హస్తం ఉండి ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మహిళా కమిషన్ ఆదేశాలతో పోలీసులు ఈ కేసు విచారణను వేగవంతం చేశారు

అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహణ

రక్తదానం ప్రాణదానంతో సమానం



జిల్లా ఎస్పీ మిడ్జిల్, అక్టోబర్ 23,జర్నలిస్ట్ డైరీ
పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. రక్తదానం అనేది మరొకరి ప్రాణాలను కాపాడే మహత్తరమైన సేవా కార్యక్రమమని, రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు, ప్రమాద బాధితులకు, ఇతర వైద్య అవసరాలున్న వారికి ప్రాణదానం చేయవచ్చని పేర్కొన్నారు. రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యపరంగా అర్హులైన వారు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం సేవాభావానికి, సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజాసేవా కార్యక్రమాల్లోనూ ముందుంటుందని పేర్కొన్నారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు జిల్లా ఎస్పీ సర్టిఫికెట్లను ప్రదానం చేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీర్, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

ప్రకాశం జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ముగిసిన జెడ్పీటీసి, ఎంపిటీసి నామినేషన్ల ప్రక్రియ

-స్వేచ్ఛగా నామినేషన్లు వేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు

ఫిర్యాదులపై తక్షణమే స్పందన

శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు



ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ప్రకాశం జిల్లా వ్యాప్తంగా జెడ్పీటీసి, ఎంపిటీసి స్థానాలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ అత్యంత ప్రశాంతమైన, పారదర్శకమైన వాతావరణంలో పూర్తయిందని జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం ఒంగోలు కలెక్టరేట్ లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారితో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.
అభ్యర్థులకు పూర్తి రక్షణ
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లా యంత్రాంగం ఎక్కడా ఏ విధమైన వ్యత్యాసాలు చూపించకుండా పూర్తిగా నిష్పాక్షికంగా వ్యవహరించిందని స్పష్టం చేశారు. నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చిన ప్రతి అభ్యర్థికీ తగిన రక్షణ కల్పిస్తూ, ఎవరికీ ఎలాంటి ఆటంకాలు ఎదురవ్వకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. నామినేషన్లు వేయడంలో ఇబ్బందులు వున్నాయంటూ గురువారం కొంతమంది అభ్యర్థులతో పాటు మాజీ మంత్రులు కూడా ఫిర్యాదులు చేశారని, అలాగే కాల్ సెంటర్ ద్వారా కూడా కొన్ని వినతులు అందాయని ఆయన ప్రస్తావించారు.?ఆ ఫిర్యాదులపై జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించిందని, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పరిస్థితిని సమీక్షించి సంబంధిత అభ్యర్థులకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు కల్పించారని వివరించారు. దీనితో వారందరూ ప్రశాంతంగా నామినేషన్లు వేసుకోగలిగారని, ఆ తర్వాత జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలుపుతూ సందేశాలు కూడా పంపారని కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు
ఫైనల్ లిస్టు 25 న ప్రకటిస్తామన్న కలెక్టర్
గతంలో జరిగిన మున్సిపల్ నామినేషన్ల ప్రక్రియ పూర్తయినందున, మున్సిపాలిటీకి సంబంధించి పోటీలో ఉండే తుది అభ్యర్థుల ఫైనల్ లిస్టును రాబోయే 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రకటిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇక జెడ్పీటీసి, ఎంపిటీసి నామినేషన్ల ఘట్టం పూర్తి కావడంతో, అనంతరం నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణల ప్రక్రియలు ముగిసిన వెంటనే పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను పబ్లిష్ చేస్తామని చెప్పారు. ఈ నామినేషన్ల ప్రక్రియ అంతా ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీల నాయకులకు, ప్రతినిధులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.
సమస్యాత్మక ప్రాంతాల్లో ఎస్పీ పర్యటన
జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను పక్కాగా అమలు చేస్తూ జిల్లా వ్యాప్తంగా బలమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వెల్లడించారు. గతంలో కొంత ట్రబుల్ లేదా ఉద్రిక్తతలు చోటు చేసుకున్న కొండేపి, కందుకూరు, దర్శి, అద్దంకి, ముండ్లమూరు తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచే స్వయంగా పర్యటించి పరిస్థితిని పర్యవేక్షించినట్లు ఎస్పీ తెలిపారు.?అభ్యర్థులు ఎవరూ ఆందోళన చెందకుండా నిర్భయంగా నామినేషన్లు వేసేలా పోలీసు శాఖ పూర్తి భరోసానిచ్చిందని స్పష్టం చేశారు. నామినేషన్ల ప్రక్రియలాగే రాబోయే ఎన్నికల తదుపరి ఘట్టాలైన స్ట్రూటినీ, ఉపసంహరణలు మరియు పోలింగ్ ను కూడా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగమంతా సమన్వయంతో, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేస్తామని ఎస్పీ చెప్పారు.

రెడీ మిక్స్ లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం.. ఘటనాస్థలంలోనే మృతి



రామచంద్రపురం అక్టోబర్ 23 జర్నలిస్ట్ డైరీ
సంగారెడ్డి జిల్లా పరిధిలోని తెల్లాపూర్‌లో శుక్రవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎలియన్స్ స్పేస్ స్టేషన్ ఎదురుగా ఉన్న భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు.పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, సాయంత్రం 5 గంటల నుంచి 5.15 గంటల మధ్య సదరు వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా, తెల్లాపూర్ నుంచి ఉస్మాన్‌నగర్ వైపు వెళ్తున్న రెడీ మిక్స్ ప్లాంట్‌కు చెందిన లారీ (నంబర్: KA 01 AM 4240) వెనుక నుంచి ఢీకొట్టింది. అనంతరం లారీ అతనిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడి పేరు, చిరునామా తదితర వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడిని గుర్తించేందుకు కొల్లూరు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.
మృతుడి వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి
మృతుడిని ఎవరైనా గుర్తించినా, ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన సమాచారం తెలిసినా కొల్లూరు పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.
గమనిక: లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వంటి అంశాలను పోలీసులు అధికారికంగా నిర్ధారించినట్లయితేనే వాటిని నిర్ధారిత వాస్తవాలుగా ప్రచురించడం మంచిది.

పొదిలిలో మళ్లీ నామినేషన్ పత్రాల చించివేత!

-నామినేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

-వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థుల పత్రాలు లాక్కుని చించివేశారంటూ ఆరోపణలు

-మార్కాపురం జిల్లా కలెక్టర్ కలెక్టర్ పర్యటన అనంతరం ఘటన..

-ఘటన పైన వైసీపీ నేతల ఆగ్రహం

-జేసీ, ఒఎస్డీ అధికారుల పర్యవేక్షణలో తిరిగి నామినేషన్లు..

-శుక్రవారం మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్ల దాఖలు

పొదిలి, మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
పొదిలి పట్టణంలోని విశ్వనాధపురంలో ఉన్న ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా మరోసారి ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం కూడా మరోసారి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను టీడీపీ నాయకులు లాక్కుని చించివేశారని ఆరోపణలు వెల్లు వెత్తాయి. ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
జిల్లా కలెక్టర్ పరిశీలించి వెళ్లిన తర్వాత ఘటన..
పొదిలి ఎంపీడీవో కార్యాలయం లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఓఎస్డీ నవజ్యోతి మిశ్రా, జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. అయితే జిల్లా కలెక్టర్ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి వెళ్లిన అనంతరం టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కి చెందిన ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను లాక్కుని చించి వేశారని ఆరోపణలు వచ్చాయి.
జేసీ, ఒఎస్డీ జోక్యంతో తిరిగి నామినేషన్లు
ఈ పరిణామాల నేపథ్యంలో అనంతరం నామినేషన్ కేంద్రానికి సందర్శించిన మార్కాపురం జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఓఎస్డీ నవజ్యోతి మిశ్రా, నామినేషన్ కేంద్రంలో ఉండి వైసీపీ అభ్యర్థులు ఇబ్బందులు లేకుండా నామినేషన్లు వేసేలా పర్యవేక్షణ చేశారు.వారి పర్యవేక్షణలో ఎంపీటీసీ అభ్యర్థులు తిరిగి నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో శుక్రవారం మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



నామినేషన్ కేంద్రం వద్ద కనిగిరి డీఎస్పీ పర్యవేక్షణ



నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కనిగిరి డీఎస్పీ మద్ది శ్రీనివాసరావు నామినేషన్ కేంద్రం వద్ద ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు.మరియు పొదిలి ఎస్సై సూరెడ్డి రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు అభ్యర్థులు నామినేషన్ సెంటర్ వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేలా భద్రతా చర్యలు చేపట్టారు.
వైఎస్సార్‌సీపీ నాయకుల ఆగ్రహం
నామినేషన్ పత్రాల చించివేత ఘటనపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేలా అధికారులు, పోలీసులు తీసుకుంటున్న చర్యలపై వైసీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

‘ఇడుపు కాయితం’ నుంచి సెకండ్


సింగిల్ ‘గడప’ పాట విడుదల

టాలీవుడ్ కథానాయకుడు ప్రియదర్శి హీరోగా, తెలంగాణ జానపద గాయని నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం ‘ఇడుపు కాయితం’. ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ నిర్మాణంలో సుకుమార్ రైటింగ్స్ -- బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై ఈ సినిమా తెరకెక్కుతోంది. వంశీరెడ్డి దొండపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన మొదటి సాంగ్ ‘శ్రీలత.. ఈ శ్రీనివాసుడే నీ జత..’ పాట ప్రస్తుతం వైరలవుతుండగా తాజాగా సెకండ్ సింగిల్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ గడప పాటను విడుదల చేయగా.. పెళ్లైన అనంతరం కొత్త కోడలు ఇంటికి వచ్చిన నేపథ్యంలో ఈ పాట సాగుతుంది. ఈ పాటకు అభినయ శ్రీనివాస్ సాహిత్యం అందించగా.. తేజు విజయ పాడారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు.



సూర్య ‘సీన్’ చిత్రంలో విలన్‌గా నస్లేన్.. గ్లింప్స్ విడుదల!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ‘సీన్’. కరుప్పు, విశ్వానాథన్ అండ్ సన్స్ వంటి వైవిధ్యమైన చిత్రాలతో దూసుకెళ్తున్న సూర్య ఈ చిత్రంతో మరోసారి బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాతో మలయాళ టాలెంటెడ్ నటుడు నస్లేన్ తమిళ చిత్ర పరిశ్రమలోకి గ్రాండ్‌గా అడుగుపెడుతున్నారు. ఇక బ్లాక్‌బస్టర్ మూవీ ‘అవేశం’ ఫేమ్ జితు మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయితాజాగా ఈ సినిమాకు సంబంధించి చిత్ర యూనిట్ విడుదల చేసిన అప్‌డేట్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో నస్లేన్ ‘ఈశ్వరన్’ అనే విలన్ పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ చిత్రంలో హీరో సూర్య ఒక శక్తివంతమైన పోలీస్ అధికారిగా డి.ఎస్.పి. ఇన్బరాజ్ పాండియన్ పాత్రలో కనిపించనున్నారు. సూర్య సరసన నజ్రియా ఫహద్ నటిస్తుండగా, మలయాళ సంగీత సంచలనం సుషిన్ శ్యామ్ సంగీతం అందిస్తున్నారు. సూర్య, జ్యోతికల నూతన ప్రొడక్షన్ హౌస్ ‘జగరం స్టూడియోస్’ మరియు ‘2డ ఎంటర్‌టైన్‌మెంట్’ సంయుక్తంగా ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాయి. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమాను ప్రపంచవ్యాప్తంగా దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న థియేటర్లలో అట్టహాసంగా విడుదల చేయనున్నారు. నస్లేన్ విలన్ ఎంట్రీ, సూర్య పోలీస్ గెటప్ కలిసి ఈ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి.



రూ.5000 కోట్ల వసూళ్లు సాధిస్తేనే సేఫ్..

భయపెడుతున్న ‘రామాయణ’ బ్రేక్ ఈవెన్ టార్గెట్!

భారతీయ చలనచిత్ర చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న నితీశ్ తివారీ చిత్రం ‘రామాయణ’ బాక్సాఫీస్ వద్ద భారీ సవాల్‌ను ఎదుర్కొనబోతుంది. ఈ సినిమాకు ఏకంగా రూ. 2,000 కోట్ల భారీ బడ్జెట్ కేటాయించంగా. సినిమా ఆర్థికంగా సక్సెస్ కావాలంటే ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 5,000 కోట్లు రాబట్టాల్సి ఉంటుందని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీపావళి కానుకగా నవంబర్ 5న విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్, ఓపెనింగ్స్, బాక్సాఫీస్ లెక్కలపై ట్రేడ్ ఎక్స్‌పర్ట్స్ పలు కీలక విషయాలు వెల్లడించారు.ఈ సినిమాకు ఏమాత్రం పాజిటివ్ టాక్ వచ్చినా బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించే అవకాశం ఉందని, అయితే రూ. 2,000 కోట్ల భారీ బడ్జెట్‌ను రికవరీ చేయడం మాత్రం అంత ఆశామాషీ కాదని విశ్లేషకులు చెబుతున్నారు. దేశీయంగా తొలి రోజు అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలోనే రూ. 75 నుంచి రూ. 100 కోట్లు, ప్రపంచవ్యాప్తంగా రూ. 150 నుంచి రూ. 200 కోట్ల ప్రీ-సేల్స్ సాధిస్తేనే సినిమాకు బలమైన పునాది ఏర్పడుతుందని ట్రేడ్ వర్గాలు పేర్కొన్నారు. ముఖ్యంగా బాలీవుడ్ మార్కెట్‌తో పాటు సౌత్ ఇండియన్ మార్కెట్ల నుంచి కనీసం 35 నుంచి 40 శాతం వసూళ్లు వస్తేనే ఈ లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమవుతుంది. ఇక ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, రవి దూబే లక్ష్మణుడిగా నటిస్తుండగా, యశ్ రావణాసురుడిగా కనిపించనున్నారు. యశ్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ భారీ పాన్-ఇండియా చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. నవంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రీవ్యూలు ప్రదర్శించనుండగా, నవంబర్ 5న సినిమా థియేటర్లలో సందడి చేయనుంది. కేవలం థియేట్రికల్ కలెక్షన్లే కాకుండా శాటిలైట్, డిజిటల్ మరియు ఇతర హక్కుల ద్వారా కూడా భారీ రాబడి వస్తేనే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ సురక్షితంగా బయటపడుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.



ఆ విషయంలో గర్వపడుతున్నా!

తన సినీ ప్రయాణంలో నటన మొదలుకొని భాష, సంభాషణలు పలికే విధానం, యాస.. ఇలా ఎన్నో విషయాల్లో విమర్శలను ఎదుర్కొన్నానని, అయితే వాటి కారణంగా తాను ఏనాడు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదని రష్మిక మందన్న స్పష్టం చేసింది. విజయ్ దేవరకొండతో కలిసి ఇటీవల ‘కాఫీ విత్ కరణ్’ సీజన్ 9లో పాల్గొన్న ఆమె తన సినీ ప్రయాణం గురించి పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది.ముఖ్యంగా హిందీ మాట్లాడే విధానం, దక్షిణాదియాసపై వస్తున్న విమర్శలకు గట్టిగా సమాధానమిచ్చింది. ‘నేను దక్షిణాది అమ్మాయిని. నా మాటల్లో ప్రాంతీయ యాస కనిపించడం సహజం. దానిని తప్పుగా అర్థం చేసుకోవద్దు. నేను నటించే ప్రతి సినిమాకు డబ్బింగ్ ఆర్టిస్టులతో సంభాషణలు చెప్పించుకునే అవకాశం ఉంటుంది. కానీ నేనే డబ్బింగ్ చెప్పాలని చాలా మంది దర్శకులు కోరుతున్నారు. భిన్న భాషల్లో సొంత గొంతుతో డబ్బింగ్ చెప్పడం సవాలుతో కూడుకున్న పని. అన్ని భాషల్లో సొంతంగా డబ్బింగ్ చెప్పడం ఎంతో గర్వంగా భావిస్తున్నా’ అని రష్మిక మందన్న పేర్కొన్నది.



ప్రభాస్ పుట్టినరోజు స్పెషల్..

-‘కల్కి 2’ నుంచి అదిరిపోయే అప్‌డేట్, మళ్లీ భైరవగా డార్లింగ్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు అదిరిపోయే కానుక అందింది. దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ‘కల్కి 2898 ఏడీ’ చిత్రానికి కొనసాగింపుగా రూపొందనున్న ‘కల్కి 2’పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు ప్రారంభమవుతుందా? ప్రభాస్ మళ్లీ ఎప్పుడు సెట్స్‌లోకి అడుగుపెడతాడా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక వీడియోను విడుదల చేసి అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది.‘కల్కి 2’కు సంబంధించిన తాజా వీడియోలో ప్రభాస్‌ను మరోసారి భైరవ పాత్రలో చూపించే కొన్ని దృశ్యాలను చిత్రబృందం పంచుకుంది. దీంతో ఈ సినిమా గురించి ఎదురుచూస్తున్న అభిమానులకు కొత్త ఉత్సాహం వచ్చింది.మొదటి భాగంలో భైరవ పాత్రలో ప్రభాస్ చూపించిన విన్యాసాలు, తెరపై ఆయన ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇప్పుడు రెండో భాగంలో ఆయన పాత్ర ఎలా ఉండబోతోందనే ఆసక్తి మరింత పెరిగింది. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఈ వీడియో సినిమా నిర్మాణంపై అభిమానుల్లో చర్చకు దారితీసింది. అయితే ఈ వీడియోతోనే చిత్రీకరణ ప్రారంభ తేదీ ఖరారైనట్లు భావించకూడదు. షూటింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వైజయంతి మూవీస్ భారీ స్థాయిలో నిర్మిస్తోంది. తొలి భాగంలో కనిపించిన అద్భుతమైన ప్రపంచాన్ని మరింత విస్తరించేలా రెండో భాగాన్ని రూపొందించనున్నారనే అంచనాలు ఉన్నాయి. ప్రభాస్‌తో పాటు సాయిపల్లవి, కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్ వంటి ప్రముఖ నటీనటులు ఈ ప్రాజెక్టుతో సంబంధం కలిగి ఉన్నారు. సంగీతాన్ని సంతోష్ నారాయణన్ అందిస్తున్నారు. ‘కల్కి 2898 ఏడీ’ తొలి భాగం విజయంతో రెండో భాగంపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. కథలోని కీలక మలుపులు, ప్రధాన పాత్రల మధ్య సంబంధాలు, భవిష్యత్తు ప్రపంచం నేపథ్యంలో సాగే సంఘటనలు రెండో భాగంలో ఎలా ఉండబోతున్నాయనే విషయంపై అభిమానులు చర్చించుకుంటున్నారు.



వెంకటేష్ ‘ఆదర్శ కుటుంబం’ ఎఫెక్ట్..

విడుదల తేదీలు మార్చుకున్న చిన్న సినిమాలు!

టాలీవుడ్‌లో సినిమాల విడుదల తేదీల మార్పులు బాక్సాఫీస్ సమీకరణాలను ప్రభావితం చేస్తున్నాయి. విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో తెరకెక్కుతున్న ‘ఆదర్శ కుటుంబం -- హౌస్ నెం. 47’ చిత్రం అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలుత అక్టోబర్ 2న విడుదల చేయాలని భావించిన చిత్ర బృందం, ఆ తర్వాత అక్టోబర్ 9కి వాయిదా వేసింది. తాజాగా మరోసారి తేదీని మార్చి అక్టోబర్ 30న విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ మార్పుతో అదే రోజున విడుదల కావాల్సిన కొన్ని చిన్న సినిమాలు తమ ప్రణాళికలను మార్చుకున్నాయి.వెంకటేష్ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రావాలని భావించిన ‘ఇట్లు అర్జున’, ‘సమ్మర్ హాలిడేస్’ చిత్ర బృందాలు వెనక్కి తగ్గినట్లు సమాచారం. ఈ రెండు సినిమాలను నవంబర్ 6న విడుదల చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. పెద్ద హీరో సినిమా విడుదలైనప్పుడు థియేటర్ల కేటాయింపు, ప్రారంభ వసూళ్ల విషయంలో చిన్న చిత్రాలకు పోటీ ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అందుకే ఒక వారం ఆలస్యంగా విడుదల చేస్తే థియేటర్లు అందుబాటులోకి రావడంతో పాటు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించేందుకు మెరుగైన అవకాశం లభిస్తుందని ఆయా చిత్రాల నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం.మరోవైపు, అక్టోబర్ 30న విడుదల చేయాలని భావించిన ‘చంద్రయాన్’, ‘ఏమో ఏమో ఇది’ చిత్రాల విడుదల ప్రణాళికల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ రెండు సినిమాల కొత్త విడుదల తేదీలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. చిత్ర బృందాలు త్వరలోనే అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. టాలీవుడ్‌లో పెద్ద సినిమాల విడుదల తేదీలు ఖరారైనప్పుడు, అదే సమయంలో విడుదలకు సిద్ధమవుతున్న చిన్న చిత్రాల నిర్మాతలు తమ ప్రణాళికలను మరోసారి పరిశీలించడం సాధారణమే. థియేటర్ల సమస్య, ప్రేక్షకుల ఆదరణ, ప్రారంభ వసూళ్లు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని విడుదల తేదీలను మార్చుకుంటుంటారు. ప్రస్తుతం ‘ఆదర్శ కుటుంబం -- హౌస్ నెం. 47’ అక్టోబర్ 30న విడుదల కానుండటంతో ఆ తేదీ చుట్టూ బాక్సాఫీస్ పోటీపై ఆసక్తి నెలకొంది. ‘ఇట్లు అర్జున’, ‘సమ్మర్ హాలిడేస్’ నవంబర్ 6కి వెళ్లగా, ‘చంద్రయాన్’, ‘ఏమో ఏమో ఇది’ కొత్త తేదీల కోసం ఎదురుచూస్తున్నాయి. అయితే ఈ విడుదల తేదీలకు సంబంధించిన తుది వివరాలు ఆయా చిత్ర బృందాల అధికారిక ప్రకటనలతో స్పష్టమవుతాయి.



Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465